సాక్షి 24|7
పెద్దపల్లి
బుధవారం 3-1-2018

FOCUS - 7వ పేజీ

కలెక్టర్‌గా దేవసేన

జనగామ నుంచి బదిలీ • ఉమ్మడి జిల్లాలో జేసీగా విధులు

సాక్షి, పెద్దపల్లి:

జిల్లా కలెక్టర్‌గా అల్లమరాజు శ్రీ దేవసేన నియమితులయ్యారు. ప్రస్తుతం జనగామ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దేవసేనను జిల్లాకు బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా తొలి కలెక్టర్ అలుగు వర్షిణి తరువాత పూర్తి స్థాయి కలెక్టర్‌గా దేవసేనను ప్రభుత్వం నియమించింది. డిసెంబర్ 31 వరకు జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉండగా, ఆయన పదవీవిరమణతో కలెక్టర్, జేసీ రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. దీనితో తాత్కాలికంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్‌ను జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్, జేసీగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. కర్ణన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం తొలిసారిగా జిల్లాకు వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం రాత్రి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఐఏఎస్‌లను బదిలీ చేసిన క్రమంలో దేవసేనను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది.




ఉమ్మడి జిల్లాలో జేసీగా విధులు

హైదరాబాద్‌కు చెందిన అల్లమరాజు శ్రీదేవసేన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కలెక్టర్‌గా నీతూ ప్రసాద్ ఉన్న సమయంలో ఆమె జేసీగా బాధ్యతలు చేపట్టారు. 1997లో గ్రూప్–1కు ఎంపికైన దేవసేన, హైద్రాబాద్ ఆర్‌డీఓగా, జీహెచ్‌ఎంసీ అదనపు క మిషనర్‌గా పనిచేశారు. - మిగతా 2లో▸

నల్ల బంగారు నేల!

జిల్లాలో అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా
దుబ్బపల్లి ప్రాంతంలో అన్వేషణ



జిల్లాలోని రామగుండం ప్రాంతంలో అపారమైన నల్ల బంగారం నిల్వలు ఉన్నాయి. దాదాపు ఇంకా వందేళ్లపాటు వెలికితీయవచ్చని పరీక్షల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే పలు భూగర్భగనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. అడ్రియాల షాఫ్ట్‌బ్లాక్ ప్రాంతంలోని 5వ, 6వ ప్యానళ్లలో 130 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు సింగరేణి అన్వేషణ విభాగం గుర్తించింది. అలాగే మంథని నియోజకవర్గం పరిధిలోని దుబ్బపల్లి ప్రాంతంలోని ఐదు స్క్వేర్ కిలోమీటర్ల పరిధిలో 600 మీటర్ల లోతులోనూ బొగ్గు నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

గోదావరిఖని:

సింగరేణిలో కొత్తగూడెం, బెల్లంపల్లి ఏరియాల్లో బొగ్గు నిక్షేపాల తవ్వకాలు మొదలైన తర్వాత రామగుండం ఏరియాలో యాజమాన్యం బొగ్గు గనులను ప్రారంభించింది. రామగుండం మండల పరిధిలోని జనగామ సమీపంలో 1959 ఫిబ్రవరి 28న మొదటి గనిని ప్రారంభించారు. ఈ గని కోసం మొత్తం 128 హెక్టార్ల స్థలాన్ని సేకరించారు. గనిలో మొత్తం బొగ్గు నిల్వలు 24 మిలియన్ టన్నులు ఉండగా... ఇందులో ఇప్పటి వరకు 20 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీశారు. మిగిలిన బొగ్గును మరో 15 ఏళ్లపాటు వెలికితీసే అవకాశం ఉంది. జీడీకే రెండో గని కూడా 1959లో ప్రారంభంకాగా, 1974లో ప్రారంభమైన జీడీకే 2ఏ గనికి కలిపి- మిగతా 2లో▸

నో చాన్స్!

- 10379 మంది 2020 సంవత్సరం వరకు అనర్హులే
- 'స్థానిక సంస్థల' పోటీదారులపై ఈసీ వేటు
- లెక్కలు చెప్పని కారణంగా ఫైనల్ నోటీసులు
- సర్పంచ్, వార్డు అభ్యర్థులు 9,148 మంది
- జెడ్పీటీసీ అభ్యర్థులు 45, ఎంపీటీసీలు 371 మంది
- అర్బన్ స్థానిక సంస్థల అభ్యర్థులు 815 అనర్హులు
- 2020 వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆదేశాలు
- పోటీ చేసే అర్హత కోల్పోయిన 10,379 మంది



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల ఖర్చు లెక్కలు చెప్పని వారిపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. ఫైనల్ నోటీసుల జారీకి మరోసారి తాజాగా జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. లెక్కలు చెప్పని వారిని 2020 సంవత్సరం వరకు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా వేటు వేసేలా ఆ ఉత్తర్వులో పేర్కొంది. వేటుపడ్డ వారిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10,379 మంది ఉన్నారు. ఇందులో ఆరుగురు సిట్టింగ్ సర్పంచ్‌లు ఉండగా, 1,203 మంది పోటీ చేసి ఓడిపోయి లెక్కలు చూపని వారు. వార్డు మెంబర్ల అభ్యర్థులు 9,170 మంది ఉండగా, 949 మంది సిట్టింగ్ వార్డు సభ్యులు ఉన్నారు. జెడ్పీటీసీ అభ్యర్థులు 45, ఎంపీటీసీ అభ్యర్థులు 371 కాగా, కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోటీ చేసిన మరో 815 మంది ఈ జాబితాలో ఉన్నారు. సర్పంచ్‌ల్లో వారికి - మిగతా 2లో▸

కొడుకును చంపిన తల్లి
- వివరాలు 15లో▸

బాలికపై లైంగికదాడి
- వివరాలు 3లో▸

పెద్దపల్లి | బుధవారం | జనవరి | 3 | 2018 సాక్షి

అరుణ్‌సాగర్ అవార్డు అందుకున్న నరేంద్రచారి



అవార్డు అందుకుంటున్న నరేంద్రచారి

పెద్దపల్లి: ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు ఎంపికైన పెద్దపల్లి 'సాక్షి' విలేకరి కట్టా నరేంద్రచారి హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత పాలగున్ని సాయినాథ్, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 12న పోపా ఎన్నికలు

- జిల్లా కన్వీనర్ శంకర్



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిటౌన్: సమాజంలో జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ అవకాశాలు కల్పించాలని పద్మశాలీ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) జిల్లా కన్వీనర్ మాటేటి శంకర్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. యాంత్రీకరణతో నేతన్నలకు ఉపాధి కరువైందని, బతుకు భారమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీలకు దక్కాల్సిన న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈనెల 12న గోదావరిఖనిలోని మార్కండేయ శివాలయం ఆవరణలోని పద్మశాలీ భవన్‌లో పోపా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని పోపా సభ్యులు, పద్మశాలీ కులబాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులుగా సిరిమల్ల జయరాములు, బూర్ల లక్ష్మీనారాయణ వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో నాయకులు బండారి రాజమల్లు, అనుమ రాజమల్లు, దాడి సురేందర్, డీవీఎస్ మూర్తి, పులి హన్మాండ్లు, బూర్ల దామోదర్, మాటేటి శ్రీనివాస్, ప్రభాకర్, ఎలిగేటి శంకర్, సామల రాజేంద్రప్రసాద్, మేర్గు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన మధ్యాహ్న భోజన కార్మికులు

పెద్దపల్లిఅర్బన్: పదిహేనేళ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొంటూ కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు బండారి వసంత మాట్లాడుతూ తక్కువ వేతనం చెల్లిస్తూ ఎక్కువ పనిచేయించుకుంటూ కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస పనికి కనీస వేతనం కింద తొమ్మిదివేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేసి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. నిరసనలో కార్మికులు పూసల రమేష్, అంగడాల వెంకటేష్, కట్కూరి స్వరూప, కల్వల పద్మ, కత్తెరమల్ల రాజలింగు, కొలిపాక స్వప్న, మారెం స్వరూప, తీగల తిరుపతి, బాలసాని ఎల్లమ్మ, గూట్ల మల్లేశ్వరి, సిరిసేటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నో చాన్స్!

▶మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘం నోటీస్‌లు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో 2020 నవంబర్ వరకు ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న వారి ఆశలు అడియాసలు కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికం..

ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎందులోనైనా ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. చివరకు ఎన్నికల్లోనూ తమ తప్పిదాల్లో నంబర్ వన్‌గా నిలిచింది. 2013, 2014లలో జరిగిన రూరల్, అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన వారు ఇప్పటివరకు ఎన్నికల జమ, ఖర్చుల లెక్కలు చెప్పని వారు 10,379 మంది ఉన్నారు. అందులో ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న ఆరుగురు సర్పంచ్‌లతోపాటు 949 మంది వార్డు సభ్యులు ఉన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పోటీ చేసిన అభ్యర్థులంతా ఫలితాలు వెలువడిన 40 రోజుల్లో ఎన్నికల ఖర్చుల వివరాలు ఎన్నికల సంఘానికి అందజేయాలి. ఈ విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో చూసీచూడనట్లు వ్యవహరించినా.. ఈసారి మాత్రం చాలా కఠినంగానే చూస్తోంది. అందులో భాగంగానే గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి జమ, ఖర్చుల వివరాలు సమర్పించని వారిపై అనర్హత వేటు వేయాలని నిర్ణయించారు. స్థానిక సంస్థలకు చెందిన వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ అభ్యర్థులు అందులో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన వారందరికీ ఖర్చుల లెక్కలు సమర్పించాలని అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో వారిపై కఠిన చర్యలు చేపట్టారు.

లెక్కలు చూపని వారిపై ఎన్నికల సంఘం చర్యలు..

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయినప్పటికీ లెక్కలు చెప్పనందుకు పనిష్మెంట్ కింద మూడేళ్ల వరకు పోటీ చేసే అర్హత కోల్పోయారు. ఈసీ నియమావళి ప్రకారం ఒక్కో అభ్యర్థి ఎంత ఖర్చు పెట్టాలన్న నిబంధనలు ఉన్నాయి. ఆ మేరకు ఎన్నికల వ్యయాన్ని సమర్పించాలని బాధ్యతను విస్మరించిన వారికి నోటీసులు ఇచ్చిన ఫలితం లేకపోవడంతో ఎన్నికల సంఘం అనర్హత వేటుకు ఆదేశించింది.

– నారాయణరావు, డీపీవో, కరీంనగర్

10,379 మంది 2020 వరకు పోటీకి అనర్హులు..

ఎన్నికల ఖర్చుల వివరాలు చెప్పని వారిపై మూడేళ్ల వరకు (2020 నవంబర్ వరకు) ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేశారు. వేటు పడ్డ వారిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10,379 మంది అభ్యర్థులు ఉండగా అందులో ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న వారు 955 మంది ఉన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులతోపాటు 57 జెడ్పీటీసీ స్థానాల నుంచి పోటీ చేసిన 45 మంది, 817 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసిన 371 మందిపైనా అనర్హత వేటు పడింది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని రెండు కార్పొరేషన్లు సహా మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నుంచి పోటీ చేసి లెక్కలు చూపని 815 మంది అభ్యర్థులకు నోటీసులు జారీ అయ్యాయి. ఇందులో అత్యధికంగా రామగుండం కార్పొరేషన్‌లో 363 మంది ఉండగా, కరీంనగర్‌లో 132 కాగా హుజూరాబాద్ నగర పంచాయతీలో ఒక్కరే ఉన్నారు.

గ్రామ పంచాయతీలు

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య	1,207
ఏకగ్రీవమై పంచాయతీలు	59
పోలింగ్ జరిగిన గ్రామ పంచాయతీలు	1,148
పోటీ చేసిన అభ్యర్థులు	4,876
లెక్కలు చూపని సర్పంచ్ అభ్యర్థులు	1,209
పోటీకి అనర్హులుగా ఎన్నికల సంఘం నోటీసులు	1,209
సిట్టింగ్ సర్పంచ్‌లు	6
పోటీకి అనర్హత కాలం	20.12.2020 వరకు

వార్డు సభ్యులు

ఉమ్మడి జిల్లాలో గ్రామ వార్డుల సంఖ్య	11,928
ఏకగ్రీవమైన వార్డులు	2,566
పోలింగ్ జరిగిన వార్డుల సంఖ్య	9,362
పోటీ చేసిన అభ్యర్థులు	25,596
లెక్కలు చూపని అభ్యర్థులు	9,170
పోటీకి అనర్హులుగా ఎన్నికల సంఘం నోటీసులు	9,170
సిట్టింగ్ వార్డు సభ్యులు	949
పోటీకి అనర్హత కాలం	20.12.2020 వరకు..

జెడ్పీటీసీలు/ఎంపీటీసీలు

మొత్తం జెడ్పీటీసీల సంఖ్య	57
మొత్తం ఎంపీటీసీల సంఖ్య	817
అనర్హత వేటు పడిన జెడ్పీటీసీ అభ్యర్థులు	45
అనర్హత వేటు పడిన ఎంపీటీసీ అభ్యర్థులు	416

అనర్హత వేటు మిగతా అభ్యర్థులు జగిత్యాల, కోరుట్ల, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంటల నుంచి ఉన్నారు. కాగా అనర్హత వేటు పడిన వారిలో ఆందోళన వ్యక్తమవుతుండగా, సర్పంచ్ అభ్యర్థి రూ.40 వేలు, వార్డు మెంబర్ అభ్యర్థి రూ.6 వేల వరకు.. ఇలా అందరికీ వ్యయాన్ని చూచించినా ఎన్నికల సంఘం.. ఆ లెక్కలు చూపని అభ్యర్థులపై చర్యలకు దిగడం చర్చనీయాంశంగా మారింది.

కలెక్టర్‌గా దేవసేన

▶మొదటిపేజీ తరువాయి

2008లో కన్‌ఫర్డ్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. అనంతరం సెర్ప్ డైరెక్టర్‌గా, ఎన్నికల కమిషన్ డిప్యూటి సీఈఓగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత కరీంనగర్ జేసీగా పనిచేశారు. జిల్లాల పునర్విభజనతో కొత్తగా ఏర్పడ్డ జనగామ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. జనగామ కలెక్టర్‌గా ఉన్న సమయంలో పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులను ఎదిరించి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం పొందారు. ప్రస్తుతం జనగామ నుంచి పెద్దపల్లి జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

పూర్తి స్థాయి కలెక్టర్

ఎనిమిది నెలల తరువాత జిల్లాకు పూర్తిస్థాయి కలెక్టర్‌ను ప్రభుత్వం నియమించింది. జిల్లా ఏర్పడ్డాక అలుగు వర్షిణి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత మే 2వ తేదీన అనూహ్యంగా ఆమెను బదిలీచేశారు. అప్పటి నుంచి జేసీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి గత నెల 31వ తేదీ వరకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు ఇన్‌చార్జీ అప్పగించడంతో, మళ్లీ ఇన్‌చార్జీ పాలనంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయి కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి, రెండు రోజుల్లో దేవసేన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

మహిళా సమస్యలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న మహిళా ప్రతినిధి

పెద్దపల్లిటౌన్: ఆది నుంచి ఆధునిక యుగం వరకు మహిళలపై వివక్ష కొనసాగుతోందని.. చైతన్యవంతులైన మహిళలు తమ సమస్యల పరిష్కారానికి సమరశంఖం పూరించాలని టీజేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురిజాల రవీందర్‌రావు అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని ఎన్ఎస్ గార్డెన్‌లో టీజేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. సమాజంలోని సామాజిక అసమానతలు, రుగ్మతలు తొలగిపోవాలంటే ప్రతి మహిళ అక్షరాస్యులై ఉండాలని సావిత్రీబాయి పూలే భావించి ఆ దిశగా కృషి చేశారన్నారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయునిగా పేరు దక్కించుకున్నారన్నారు. ఆమె స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. నేటి సమాజంలో ఆర్థిక, సామాజిక, రాజకీయంగా విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మహిళలు అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కోట్లాది రూపాయలు వ్యాపార ప్రకటనల ద్వారా ఆర్జిస్తున్న సానియామీర్జా, పీవీ సింధులకు ప్రభుత్వాలు భారీ నజరానాలు అందించకుండా గ్రామీణ మహిళా క్రీడాకారిణులకు ప్రోత్సాహం అందిస్తే దేశానికి పేరు తెచ్చేలా కష్టపడతారన్నారు. టీజేఏసీ మహిళా నాయకురాలు ఆర్.లక్ష్మి, మమతలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మహిళలే కీలకంగా వ్యవహరించారని, అలాంటి మహిళలను విస్మరించి మంత్రివర్గంలో ఒక్కరికి కూడా చోటివ్వక పోవడం కేవలం కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. టీజేఏసీ ఆధ్వర్యంలో రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేశామన్నారు. తెలంగాణలో నూటికి 76 శాతం మంది మహిళలు వ్యవసాయ కూలీలుగా, వ్యవసాయాధారిత పనుల్లో పని చేస్తున్నారని, కానీ.. నూటికి 56 శాతం మగవారు మాత్రమే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులపై ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తుందని.. ఇప్పటివరకు రైతు ఆత్మహత్యల సమస్యకు శాస్త్రీయమైన పరిష్కారం దొరకలేదన్నారు. ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని టీజేఏసీ రాష్ట్రంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని, మహిళలంతా చైతన్యవంతులై రాబోయే ఎన్నికల్లో మహిళా వ్యతిరేక టీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ డొంకెన రవి, కన్వీనర్ జేవీ రాజు, కేశవరెడ్డి, సోడాబాబు, పాషా, దబ్బెట చంద్రకళ, శారద, సరళ, రాధ, కోమల, శ్యామల, పిల్లి చంద్రశేఖర్ ముదిరాజ్, రఘు, రమణాచారి, ఒజ్జ తిరుపతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రాణం తీసుకున్నారు..

- వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య
- అనారోగ్యంతో ఒకరు.. ఆవేదనతో మరొకరు.. భవిష్యత్‌పై బెంగతో ఇంకొకరు..
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

క్షణికావేశం.. అనారోగ్యం.. మానసిక ఆందోళన.. కుటుంబ పరిస్థితులు.. భవిష్యత్ ఎలా ఉంటుందోననే భయం... ఇలా.. కారణాలు ఏమైనా నిండు జీవితాన్ని అర్థంతరంగా ముగించారు. ఇద్దరు పిల్లలను వదిలి తల్లి ఓ చోట.. ఎంతో భవిష్యత్ ఉన్న బాలిక మరోచోట.. తల్లిదండ్రుల ఆశలసౌధంగా నిలిచిన కుమారుడు ఇంకో చోట.. మంగళవారం నాడు ప్రాణం తీసుకున్నారు. క్షణికావేశంలో ఈ లోకాన్ని విడిచి కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచేశారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య


శివకుమార్(ఫైల్)


రోదిస్తున్న తల్లి

మానకొండూర్: ఉన్నతచదువులు చదివాడు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. అందుకోసం కఠోరంగా శ్రమిస్తున్నాడు. ఇంతలో ఏమైందో ఏమోకానీ.. తను చదువుపై శ్రద్ధ పెట్టడం లేదని, ఆరోగ్యం సహకరించడం లేదని తీవ్రమనోవేదనకు గురయ్యాడు. ఆత్మహత్య చేసుకుందామని ఇప్పటికే ఎనిమిదిసార్లు సూసైడ్ నోటు రాసిన ఆ యువకుడు చివరికి చితికి చేరాడు. ఈ హృదయవిదారక ఘటన మంగళవారం మానకొండూర్ మండలం ఖాదర్ గూడెం గ్రామంలో చోటు చేసుకుంది.

గ్రామానికి చెందిన సీత రాజయ్య, రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు శ్రీకాంత్, శివకుమార్(24). శ్రీకాంత్‌కు వివాహం కాగా ప్రస్తుతం ఆర్మీలో చేస్తున్నాడు. రాజయ్య అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు.కోడలు పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో రాధమ్మ, శివకుమార్ ఉంటున్నారు. టీటీసీ చేసిన శివకుమార్ టెట్‌లో క్వాలిఫై అయ్యి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాడు.

సూసైడ్ నోటు రాసి...

సోమవారం రాత్రి శివకుమార్, తల్లి వేరువేరు గదుల్లో నిద్రించారు. మంగళవారం ఉదయం శివకుమార్‌ను నిద్రలేపడానికి గది తలుపులు తీయగా ఉరేసుకుని కనిపించాడు. రాధమ్మ బోరున విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చిచేరారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో సూసైడ్‌నోటును స్వాధీనం చేసుకున్నారు.

భవిష్యత్‌పై భయమేస్తోంది...

శివకుమార్ రాసిన సూసైడ్‌నోటులో... ఇది తన ఎనిమిదో సూసైడ్ నోటని, ఈ సారి చనిపోవడానికి ధైర్యం వచ్చిందని రాశాడు. కొద్ది నెలలుగా ఆరోగ్యం బాగాలేదని, చదువుపై శ్రద్ధ పెట్టడం లేదని, భవిష్యత్‌పై భయం కలిగిందని, తన మరణానంతరం అవయవాలు దానం చేయాలని నోటులో పేర్కొన్నాడు.

అవయవాలు దానం..

శవ పంచనామా నిర్వహించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కోరిక మేరకు కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేశారు. తల్లి రాధమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు.

భర్త వేధింపులతో భార్య..

వీణవంక(హుజూరాబాద్): భర్త వేధింపులు భరించలేక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన గుంపుల సుమలత(25) కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. సుమలతకు గుంపుల గట్టయ్య ఆలియాస్ నవీన్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రెండేళ్లుగా గట్టయ్య మద్యానికి అలవాటు పడ్డాడు. నిత్యం తాగొచ్చి భార్యను వేధించేవాడు. సోమవారం కూడా తాగివచ్చి గొడవ చేయడంతో బాధ భరించలేక ఇంట్లో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. పక్కింటి వారు గమనించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంగళవారం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది. మృతురాలి సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో బాలిక..


అనుష మృతదేహం

రామడుగు(చొప్పదండి): రామడుగులో కడుపు నొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన ఈరెళ్ల అనూష (15) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా వ్యాధి నయం కాలేదు. ప్రస్తుతం స్థానిక మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. పాఠశాలకు ఎందుకు వెళ్లడం లేదని సోమవారం సాయంత్రం అనూషను తన సోదరి మందలించింది. దీంతో బిల్డింగ్‌పైకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి బీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేటుగాడి కోసం వేట


బ్యాంకులో వేసిన ఫేక్‌చెక్కు


హైదరాబాద్‌లో చెల్లని చెక్కు కేసులో అరెస్టు అయ్యింది వీరే..

- జమ్మికుంట వ్యాపారి యాంసాని సురేశ్‌కోసం పోలీసుల గాలింపు
- రూ. 8 కోట్లు కాజేసేందుకు యత్నం
- 8 మందితో కలిసి జమ్మికుంటలో స్కెచ్
- హైదరాబాద్ ఐసీఐసీఐ బ్యాంకులో అమలు
- చెల్లని చెక్కుతో మోసం చేద్దామని..
- అడ్డంగా దొరికిన నలుగురు
- పరారీలో మరో నలుగురు..

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంటకు చెందిన అడ్తి వ్యాపారి యంసాని సురేశ్‌కోసం హైదరాబాద్ పోలీసులు గాలిస్తున్నారు. హబ్సిగూడ ఐసీఐసీఐ బ్యాంకులో చెల్లని చెక్కు ఇచ్చి రూ.8 కోట్లు కాజేసేందుకు ఓ ముఠా యత్నించగా పోలీసులకు అడ్డంగా చిక్కారు. వారిని విచారించగా సురేశ్ ఇందులో సూత్రధారిగా వారు పేర్కొన్నారు. దీంతో హబ్సిగూడ పోలీసులు జమ్మికుంట పట్టణంలో సురేశ్ కోసం ఆరా తీస్తున్నారు.

అసలు ఏం జరిగింది..?

జమ్మికుంటకు చెందిన యంసాని సురేశ్, శ్రావణ్ కుమార్, సంపంత్‌కుమార్, శ్యాంసుందర్ మరో నలుగురితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. అడ్డదారిలో డబ్బు సంపాదించాలని పథకం పన్నారు. బెంగళూరుకు చెందిన ఓ పేరున్న కంపెనీ పేరిట రూ.8 కోట్లతో చెక్కు(710199)నంబర్‌తో తయారు చేశారు. దానిని తన ఖాతాలోకి బదిలీ చేసుకునేందుకు శ్యాంసుందర్ మరో ఇద్దరితో కలిసి డిసెంబర్ 28న హైదరాబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకుకు వెళ్లాడు. చెక్కును బ్యాంకులో వేశాడు. పరిశీలించిన బ్యాంకు మేనేజర్ అనుమానంతో దానిపై ఉన్న బెంగళూరు కంపెనీకి ఫోన్ చేశాడు. చెక్కుపై ఉన్న రూ.8 కోట్లను గురించి ఆరా తీశాడు. ఆ చెక్కు తాము ఇవ్వలేదని వెల్లడి కావడంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసుల అక్కడికి చేరుకుని ముగ్గురిని వారిని అరెస్టు చేశారు. విచారించగా జమ్మికుంటకు చెందిన యాంసాని సురేశ్ చెక్కు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కేసులో మొత్తంగా నలుగురిని పట్టుకున్న పోలీసులు డిసెంబర్ 31న కోర్టుకు అప్పగించారు.

ఎవరీ సురేశ్..?

జమ్మికుంటకు చెందిన సురేశ్ ఆడ్తి, రైస్‌మిల్లు, కాటన్‌మిల్లుల్లో భాగస్వామ్య వ్యాపారం చేసేవాడు. నష్టాలు రావడంతో ఏడాదిగా వ్యాపారాలకు దూరంగా ఉంటున్నాడు. అప్పులు కోట్లలో పెరిగిపోవడంతో అడ్డదారిలో డబ్బు సంపాదించాలని ఆలోచన చేశాడు. ఇందులో మరో వ్యక్తి అయిన శ్రావణ్ కుమార్ సైతం గతంలో కాటన్ వ్యాపారాలు చేసి దివాళా తీశాడు. శ్యాంసుందర్, సంపత్ సురేశ్‌కు బంధువులవుతారని సమాచారం. వీరు సైతం రైస్‌మిల్ వ్యాపారంతో నష్టపోయినట్లు జమ్మికుంటలో చర్చ జరుగుతోంది.

జమ్మికుంటలో స్కెచ్..!

వీరు పన్నిన చెక్కుపన్నాగంలో సఫలమైతే తలో రూ.కోటి పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల విచారణ తేలింది. ఇందు కోసం జమ్మికుంటలోని ఓ రైస్‌మిల్‌లో సమావేశమైనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రూ. 8 కోట్లకు టోకరా వేసిన వారిలో జమ్మికుంట వ్యాపారులే కీలకం కావడం జమ్మికుంట పట్టణంలో సంచలనం సృష్టిస్తోంది.

తరగతి గదిలో ఆగిన అధ్యాపకుడి గుండె

- గుండెపోటుతో ప్రైవేట్ లెక్చరర్ మృతి
- కన్నీటి పర్యాంతమైన విద్యార్థులు


మృతుడు కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ ప్రైవేట్ కాలేజీలో పనిచేసే అధ్యాపకుడి గుండె తరగతి గదిలోనే ఆగిపోయింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని రాచర్ల జూనియర్ కళాశాలలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. చిగురుమామిడి మండలం సుందరగిరికి చెందిన వంతడ్పుల కొమురయ్య ఉరఫ్ కుమార్(48) స్థానిక రాచర్ల జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా చేస్తున్నారు. రోజూలాగే మంగళవారం విద్యాబోధన చేశారు. సాయంత్రం విద్యార్థులు వెళ్లిపోగా కాసేపు తరగతి గదిలోని కుర్చీలోనే కూర్చున్నారు. కుమార్ ఎంతకీ బయటకు రాకపోవడంతో సహచర అధ్యాపకులు తరగతి గదికి వెళ్లారు. కుమార్‌ను తట్టి లేపేందుకు యత్నించగా కుప్పకూలాడు. వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుకు గురై చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమార్ మృతి చెందినట్లు తెలుసుకున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడికి భార్య సురోమణి, కూతురు హర్షిణి ఉన్నారు.

బాలికపై అత్యాచారం

- సెల్‌ఫోన్లో వీడియో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు
- నెలరోజుల తర్వాత ఠాణాలో బాధితురాలి ఫిర్యాదు
- పోలీసుల విచారణ

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మార్కండేయకాలనీకి చెందిన 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేశాడో ప్రబుద్ధుడు. ఎస్సై దేవేందర్ కథనం... నెల రోజుల క్రితం కనుకుల ప్రాంతంలో కట్టెలు ఏరేందుకు వెళ్లిన బాలికకు మండలంలోని కదంబాపూర్‌కు చెందిన బండి శ్రీనివాస్, పెద్ది నగేశ్ కూల్‌డ్రింక్స్‌లో మత్తు మందు కలిపి ఇచ్చారు. అనంతరం అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ చిత్రాలను సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. అనంతరం సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవుల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, తమిళనాడు, కేరళల్లోని దక్షిణ తీర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఉత్తర, వాయవ్య భారతం, తూర్పు రాష్ట్రాలు, ఢిల్లీలో దట్టమైన నుంచి అతి దట్టమైన పొగ మంచు ఆవరించి ఉంటుంది. వాయవ్య భారతంలో చలిగాలులు వేచే అవకాశం ఉంది.

గుంటూరు/కరీంనగర్ వాతావరణం

గరిష్ఠం కనిష్ఠం

30.9°/15.2°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	17.7	08.4
కోల్‌కతా	24.8	15.0
బెంగళూరు	29.0	17.8
ముంబై	28.7	14.1
చెన్నై	30.6	22.4

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
అనంతపురం	33.2/17.3	విజయవాడ	30.2/20.0
గుంటూరు	33.0/15.2	వరంగల్	30.1/16.0
కర్నూలు	32.5/18.7	ఆదిలాబాద్	30.1/07.4
మహబూబ్‌నగర్	32.3/18.0	ఏలూరు	29.8/20.9
కడప	32.2/18.0	రాజమండ్రి	29.8/20.9
ఒంగోలు	31.6/22.1	తాడేపల్లిగూడెం	29.8/20.9
నెల్లూరు	31.5/22.5	కాకినాడ	29.7/21.5
మెదక్	31.3/12.0	హైదరాబాద్	29.6/15.8
చిత్తూరు	31.2/18.4	రంగారెడ్డి	29.6/15.8
తిరుపతి	31.2/18.4	నల్లగొండ	29.4/15.0
ఖమ్మం	31.0/14.4	విశాఖపట్నం	29.0/21.4
నిజామాబాద్	30.9/14.8	శ్రీకాకుళం	27.0/17.5
కరీంనగర్	30.5/13.3	విజయనగరం	27.0/17.5

బుల్లితెర

W

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

- ఉ.06.30 గుడ్ మార్నింగ్
- ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
- ఉ.08.30 న్యూస్ ఫీచర్
- ఉ.09.00 రీజనల్ న్యూస్
- ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
- ఉ.10.00 సాక్షి న్యూస్
- ఉ.10.30 న్యూస్ ఫీచర్
- మ.02.30 డాక్టర్స్ టైమ్
- సా.04.30 మార్గం
- సా.05.00 స్పీడ్ న్యూస్
- సా.05.30 ఉర్దూ న్యూస్
- రా.07.30 పొలిటికల్ కారిడార్
- రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
- రా.09.00 న్యూస్ 360
- రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
- రా.10.30 స్క్రీన్‌ప్లే
- రా.11.30 న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
- ఉ.07.00 పాండు
- ఉ.09.30 కొడుకు
- మ.12.00 అన్నయ్య
- సా.06.00 నాయకుడు
- రా.09.00 శ్రీరామ్



మూవీస్ నౌ
- ఉ.08.55 థోర్
- మ.01.35 ద మాస్క్
- మ.03.15 డై అనదర్ డే
- సా.05.30 ఫైనల్ డెస్టినేషన్ 3
- రా.09.00 రష్ అవర్ 3




హెచ్‌బీవో
- ఉ.06.00 మునిచ్
- ఉ.08.47 ద అకౌంటెంట్
- మ.01.47 టవర్ ఆఫ్ డెత్
- సా.05.01 ఐరన్ మ్యాన్
- రా.09.00 సూసైడ్ స్క్వాడ్



స్టార్ మూవీస్
- ఉ.08.16 ద వోల్వరిన్
- ఉ.10.40 జూటాపియా
- మ.12.38 ప్రిడేటర్
- సా.04.43 కుంగ్‌ఫు పాండా 3
- రా.09.00 స్పైడర్-మ్యాన్



మా మూవీస్
- ఉ.07.00 రామదండు
- ఉ.09.00 ఎస్.పి.పరశురాం
- మ.12.00 మొదటి సినిమా
- సా.06.00 నువ్వు లేక నేను లేను
- రా.09.00 మన్మథ



జీ సినిమా
- ఉ.04.45 షాదీ సే పెహ్లే
- ఉ.08.30 దిల్‌దార్: ద అర్య
- ఉ.11.28 హసీనా మాన్ జాయేగీ
- రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2
- రా.11.54 త్రిపుర

తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం, గదుల వివరాలు:

ఉచిత గదులు	– ఖాళీ లేవు
రూ.50 గదులు	– 05 ఖాళీ ఉన్నాయి
రూ.100 గదులు	– 20 ఖాళీ ఉన్నాయి
రూ.500 గదులు	– ఖాళీ లేవు
సేవలు	
సహస్ర దీపాలంకరణ	– ఖాళీ లేవు
వసంతోత్సవం	– ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	– ఖాళీ లేవు
బుధవారం ప్రత్యేక సేవ	– సహస్రకలశాభిషేకం



వేములవాడ ఆలయ సమాచారం

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. రాత్రి 7 గంటలకు అందిన సమాచారం ప్రకారం గదుల వివరాలు..

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	05	1,000
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	23	750
నందీశ్వర సాధారణ	31	350
రాజేశ్వరపురం ఏసీ	03	750
రాజేశ్వరపురం సాధారణ	09	350
లక్ష్మీగణపతి	38	250
పార్వతీపురం స్పెషల్	19	500
పార్వతీపురం సాధారణ	18	200
శివపురం	42	150
శంకరపురం	51	50

పులిహోర, లడ్డూ, లడ్డూ భోగం అందుబాటులో ఉన్నాయి.

– వేములవాడ



చికెన్ ధరలు

లైవ్ కోడి	:	120	బోన్‌లెస్	:	350
చికెన్	:	150	మటన్ కిలో	:	500
స్కిన్‌లెస్	:	170			- కరీంనగర్



Padi-Panta

పాల దిగుబడిపై 'గాలికుంటు' ప్రభావం

- నివారణకు టీకాలు వేయించాలి
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రాజన్న

పెద్దపల్లిరూరల్: పాడి, పశుసంపదకు నష్టం కలిగించే వ్యాధుల్లో గాలికుంటు రోగం ఒకటి. దేశవాళి పశువుల్లో కంటే, సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి మరింత తీవ్రంగా ఉంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాజన్న తెలిపారు. అత్యంత సూక్ష్మ జీవుల వలన వచ్చే ఈ వ్యాధి పశువుల్లో మరింత తీవ్రంగా వుంటుందని, ఈ వ్యాధి వల్ల పశువులకు ప్రాణహాని అంతగా లేకపోయినా, పాల దిగుబడి సగ భాగానికి తగ్గి, ఆర్థికంగా చాలా నష్టం జరుగుతోందన్నారు. పశువుల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడంతో పాటు గర్భస్రావానికి గురయ్యే అవకాశాలుంటాయన్నారు. చలికాలంతో పాటు, మార్చి, ఏప్రిల్ మాసాల్లో, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకోసం పెద్దపల్లి జిల్లాలో ఉచితంగా గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు పశు వైద్య సిబ్బంది ఊరురా వేస్తున్నారని పేర్కొన్నారు. జనవరి 13వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



డాక్టర్ రాజన్న


వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు మేత తినలేవు. 10డీఎఫ్ వరకు జ్వరం ఉంటుంది. చొంగ కారుస్తాయి. నోటిలో, గిట్టల మధ్య పుళ్ళు ఏర్పడతాయి. కాబట్టి పశువులు మేత తినలేవు, నడవలేవు. నీరసించిపోతాయి. వ్యాధి గురైన పశువుల పాలు తాగిన దూడలు చనిపోయే అవకాశం వుంటుంది. గిట్టలలో పుండ్ల వలన ఎడ్లు వ్యవసాయ పనులు చేయలేవు.

వ్యాధి నివారణ

అన్నింటికంటే ముందు జబ్బు పడ్డ పశువులను వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలు తాగకుండా చూడాలి. నోటిని, గిట్టలను పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంతో రోజుకి రెండుసార్లు కడగాలి. ఆ తర్వాత బోరో గ్లిసరిస్ వంటి పేస్ట్‌ను పొక్కులపై రాయాలి. ఈగలు వాలి, పురుగులు పట్టకుండా వేప నూనె రాయాలి. మేత తినలేవు కాబట్టి అంబలి లేదా గంజిలాంటి మెత్తని ఆహారం ఇవ్వాలి. వ్యాధి సోకిన పశువులు తినగా మిగిలిన గడ్డి, వేసిన పేడ, మూత్రాలను వెంటవెంటనే తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలి. క్రిమిసంహారకాలతో కడగాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పాతిపెట్టాలి. పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించిన విధంగా, కాలానుగుణంగా వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలి.





చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	140	170

భవిష్యం

మేషం: వ్యయ ప్రయాసలు. బంధువులతో మాటపట్టింపులు. దేవాలయాలు సందర్శిస్తారు. అనుకోని ఖర్చులు. వృత్తి, వ్యాపారాలలో ఇబ్బందులు.

వృషభం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. మిత్రుల నుంచి ధనలాభం. విలువైన వస్తువులు సేకరిస్తారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. పనుల్లో జాప్యం జరగవచ్చు. కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యులతో విభేదాలు రావచ్చు. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగా సాగే అవకాశం ఉంది.



కర్కాటకం: విద్యార్థులకు అనుకూల సమాచారం. విందువినోదాలు. కార్యసిద్ధి. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఊహించని లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు.

సింహం: మిత్రులతో కలహాలు. కొత్త రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. పనుల్లో ఆటంకాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

కన్య: దూరపు బంధువుల కలయిక. విందు వినోదాలు. చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. శుభవార్తలు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

తుల: సన్నిహితులతో వివాదాలుసర్దుబాటు కాగలవు. ఆర్థికాభివృద్ధి. పనుల్లో పురోగతి. శుభకార్యాలకు హాజరవుతారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.

వృశ్చికం: ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యయప్రయాసలు. కుటుంబసభ్యులతో వివాదాలు. వృత్తి, వ్యాపారాలు సాధారణంగా ఉంటాయి.

ధనుస్సు: మిత్రులతో మాటపట్టింపులు. శ్రమాధిక్యం. పనులు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి.

మకరం: ఇంటాబయటా అనుకూలం. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులు సమర్థత చాటుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

కుంభం: వ్యవహారాలలో విజయం. ఆహ్వానాలు రాగలవు. ఆస్తి వివాదాల నుంచి విముక్తి. సంఘంలో గౌరవం. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొత్త అవకాశాలు.

మీనం: మిత్రులతో కలహాలు. దూర ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆలయాల సందర్శన. వ్యాపారులకు ఒత్తిళ్లు. ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతారు.

– సింహంభట్ల సుబ్బారావు



జోరుగా ఇసుక దందా!

ఎలిగేడు: హుస్సేనిమియా వాగు నుంచి ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. దళారులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఇసుకను అమ్ము కుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి లేకుండా ఇసు కను తరలిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుంది. విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తుండడంతో వాగు చుట్టు ఉన్న పంటపొలాలకు నీరులేక భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

జూలపల్లి మండలం పెద్దాపూర్‌లో హుస్సేనిమియా వాగు ప్రారంభమై జూలపల్లి మండల కేంద్రం నుంచి ఎలిగేడు మండలం కోనరావుపేట, ధూళికట్ట, వడ్కాపూర్, ముప్పిరితోట, లోకపేట మీదుగా కొనసాగుతుంది. ఈ ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఇసుకను రవాణా అక్రమంగా రవాణా చేస్తూ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకకు సుమారు రూ.1500 వరకు తీసుకుంటూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని రెవెన్యూ శాఖ, పోలీసు యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరించడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వందలాది ఇసుక ట్రిప్పులు ఇప్పటికే వాగు నుంచి తరలించారు. దీంతో చుట్టు పక్కల సాగు చేస్తున్న రైతులు తమ వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు అడుగంటి తమ పంటపొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఈ ఇసుక అక్రమ దందాపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిపై చర్యలు చేపట్టి భూగర్భజలాలు పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు.

భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి..



హుస్సేనిమియా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడడమే కాక వాగు చుట్టు ఉన్న బావుల్లో భూగర్భజలాలు అడుగంటి పంట పొలాలకు నీరందడం లేదు. ఇసుక అక్రమ దందా కొనసాగిస్తున్న వారిపై చర్యలు చేపట్టి భూగర్భ జలాలను సంరక్షించాలి.

– బాలుసాని శ్రీనివాస్, రైతు

అక్రమ రవాణాను అడ్డుకుంటాం



హుస్సేనిమియావాగు వెంట ఇసుకను తరలిస్తే చర్యలు చేపట్టి కేసులు పెడతాం. ఇప్పటి నుంచి వాగు పరిసర ప్రాంతాల్లో వీఆర్వో, ఆర్ఐలతో నిఘా పెట్టించాం. అక్రమ రవాణాను అడ్డుకుంటాం. అనుమతి లేకుండా అక్రమ రవాణా కొనసాగించే ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం.

– ఆర్.సురేశ్, తహసీల్దార్, ఎలిగేడు



కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారంలోని గొల్లవాడలో సీసీ రోడ్డు నిర్మించి డ్రెయినేజీ కోసం గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో చెత్తాచెదారం పేరుకపోయి దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం పాలవుతున్నందున డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010277735

న్యూస్ బాక్స్

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాయిబాబ ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మాటేటి గట్టయ్య, సభ్యులు జూలూరి అశోక్ కుమార్, వల్స నీలయ్య, తుమ్మ రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దపల్లిఅర్బన్: భారత ప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్నట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఇమ్మడిశెట్టి లక్ష్మన్, మీసాల మల్లిక్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాల వివరాలను ప్రకటించారు. వీరిలో ముగ్గురు పీజీ హెచ్‌ఎంలు, 11 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ముగ్గురు భాషా పండితులు, 12 మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్, పీఈటీ ఒకరు, ఇద్దరు కేజీబీవీ, ఇద్దరు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 3న సావిత్రిబాయి పూలే 187వ జయంతిని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కోలాటం మహిళలకు బహుమతులు అందజేత

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మిదుర్గయ్య ఆధ్వర్యంలో మహిళలకు నెలరోజులుగా కోలాటం శిక్షణ ఇచ్చారు. సోమవారం రాత్రి మహిళలకు కోలాటం ప్రదర్శన నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ఎంపీపీ లక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పడాల తార, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన భూ రికార్డుల శుద్ధీకరణ

గర్రెపల్లి: ఐతరాజ్‌పల్లి, దుబ్బపల్లి గ్రామాల్లో వారం రోజులుగా కొనసాగుతున్న భూ రికార్డుల శుద్ధీకరణ గ్రామసభలు మంగళవారం ముగిశాయి. రెవెన్యూ బృందం లీడర్, నయబ్ తహసీల్దార్ దేవేదర్‌రావు పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ కల్వాల లావణ్య, ఎంపీటీసీ భూమేశ్, వీఆర్వో రాంరెడ్డి, రైతులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలోని ప్రధానదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను, ముళ్ల పొదలను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మంగళవారం తొలగించారు. పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులతో కూడిన ఎన్‌ఎస్‌ఎస్ బృందం మూడు రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గ్రామంలో పర్యటిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోత్తంరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నరహరి, అధ్యాపకులు సంతోశ్‌రెడ్డి, రమాదేవి, సామాజిక కార్యకర్తలు శోభ, సౌజన్య పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న వలంటీర్లు

బాధ్యులను శిక్షించండి

పెద్దపల్లిఅర్బన్: మల్లాపూర్ ప్రార్థన మందిరంలో చొరబడి పవిత్ర గ్రంథాలను దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పాస్బన్ ఈ మిల్లత్ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు సయ్యద్ మస్రత్ మాట్లాడుతూ గ్రంథాన్ని దహనం చేయడం సిగ్గుచేటన్నారు. నిందితులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిఘా పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ మక్సూద్, ఇమ్రాన్, సయ్యద్ జావీద్, సాజిద్, ఫసి, సయిద్, జియాఉద్దీన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

లోకల్ వాయిస్

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించండి



పెద్దపల్లి ప్రధాన కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు సరిగా లేవు. పందులు, కుక్కలు, పశువులు నిత్యం స్వైరవిహారం చేస్తున్నాయి. వీటికి తోడు మార్కెట్‌లో మిగిలిన కూరగాయలను దారి వెంటే పోయడంతో మరీ అధ్వానంగా మారుతోంది. మాంసం విక్రయాలు కూడా ఇష్టారాజ్యంగా చేస్తుండడంతో శాఖాహారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– జగదీశ్ అట్టల్, పెద్దపల్లి

ఆమె కళ్లు సజీవం!

- మరణించినా మరో ఇద్దరికి చూపు
- నేత్రాలు దానం చేసిన ఆదర్శ కుటుంబం



అనవేని వరలక్ష్మి(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): ఆమె చూపు సజీవం... మరణించినా ఈ లోకాన్ని చూస్తుంది. ఇద్దరు అంధులకు చూపు నిచ్చింది. మరణించిన ఓ మహిళ నేత్రాలను సమాజహితం కోసం.. గోదావరిఖనిలో ఆమె కుటుంబ సభ్యులు ఐ బ్యాంక్‌కు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన అనవేని కనకయ్య, సింగరేణి సంస్థ ఆర్జీ–1 పరిధిలోని 2ఏ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య అనవేని వరలక్ష్మి (55) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. కనకయ్య అల్లుడు దబ్బెట శంకర్, కూతురు కవిత సూచనల మేరకు వరలక్ష్మి నేత్రాలను, స్థానిక సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసన్ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లోని వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ కిరణ్ స్వయంగా గోదావరిఖనికి వచ్చి వరలక్ష్మి నేత్రాలు సేకరించారు. నేత్రాలు హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు పంపించారు. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన వరలక్ష్మి ధన్యజీవని సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రవణ్‌కుమార్, ప్రతినిధులు లింగమూర్తి, కై లాసం, రాజమౌళి, కె.ఎస్.వాసు కొనియాడారు. వారి అకాల మరణానికి చింతిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. నేత్రదాత భర్త కనకయ్య, కూతురు కవిత, అల్లుడు దబ్బెట శంకర్‌తోపాటు సహకరించిన బంధువులను వారితోపాటు సింగరేణి సంస్థ ఆర్జీ–1 2వ, 2ఏ గని ఏజీఎం సాంబయ్య, మేనేజర్ మల్లయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ అభినందించారు.

నిరంతర విద్యుత్ సరఫరా సక్సెస్

- కస్టమర్ చార్జీలు చెల్లించి సహకరించండి
- ఆటోస్టార్టర్లు స్వచ్ఛందంగా తొలగించండి
- కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ కె.మాధవరావు



శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘాల నాయకులు



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్ఈ మాధవరావు, ఉద్యోగులు

కొత్తపల్లి(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా సక్సెస్ అయిందని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ కె.మాధవరావు వెల్లడించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి జనవరి1 అర్ధరాత్రి వరకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ వరంగల్ కంపెనీ పరిధిలోని కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ పరిధిలో 3,300 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరగగా, ఉదయం 9.30 గంటల ప్రాంతంలో 2935 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగిందని చెప్పారు. ఇందులో కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 974 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు వివరించారు. గత ఖరీఫ్‌సాగులో 24 గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తలేదన్నారు. గతంలో 9గంటల విద్యుత్ సరఫరా సందర్భంగా ఒకరోజు 9.46 మిలియన్ యూనిట్లు వినియోగించగా, ప్రస్తుత 24 గంటల సమయంలో 14.564 మిలియన్ యూనిట్లకు విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. వ్యవసాయ పంప్‌సెట్ల కస్టమర్ చార్జీలకు సంబంధించి రూ.29.54 కోట్ల బకాయిలున్నాయని తెలిపారు. ఈ ఏడాది రూ.10.70 కోట్ల బకాయిల్లో రూ.6.74 కోట్లు వసూలైనట్లు చెప్పారు. రైతులు కస్టమర్ చార్జీలు చెల్లించి సహకరించాలని కోరారు. అదే విధంగా ఆటోమేటిక్ స్టార్టర్లను రైతులే స్వచ్ఛందంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఈకి కృతజ్ఞతలు

నూతన సంవత్సర కానుకగా విద్యుత్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంక్రిమెంట్‌ను ప్రకటించడాన్ని హర్షిస్తూ పలు విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు ఎస్ఈ మాధవరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టిఆర్‌వీకెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్, నాయకులు ఎస్.మునీందర్, ఎస్.మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, ఎస్.రాజలింగం, ఎ.ప్రకాష్, ఎస్‌కే మీర్జాన్, టీఎస్ఈఈయూ–327 అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, టీఎస్‌యూఈఈయూ (సీఐటీయూ) నాయకులు జి.రాందాస్ నాయక్, బి.గజంలాల్, ఎం.మల్లయ్య, శ్రీకాంత్ సురభి, ఆరెండబాబు, రమణ, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కొత్తపల్లి(కరీంనగర్): వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌తో పాటు నూతన సంవత్సర కానుకగా విద్యుత్ సంస్థలోని ఉద్యోగులందరికి ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్‌ను ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ కె.మాధవ రావు మాట్లాడుతూ తెలంగాణ వస్తే అంధకారం అవుతుందన్న అసత్యాలను తిప్పికొడుతూ ఆరు నెలల్లోనే విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ మెరుగైన పీఆర్‌సీ వచ్చేలా కృషి చేస్తామని, ఆర్టిజన్ ఉద్యోగులందరికీ పేస్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించేలా ప్రభుత్వానికి విన్నవిస్తామని ప్రకటించారు. డీఈ ఈశ్వరప్రసాద్, ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఏఓ శ్రీనివాస్‌తోపాటు టివీఆర్‌కెఎస్ నాయకులు ఎస్.మునీందర్, ఎస్.మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, ఎస్.రాజలింగం, ఎ.ప్రకాష్, ఎస్‌కే మీర్జాన్, ఎస్.లక్ష్మీనారాయణ, జి.సంజీవ్‌కుమార్, కె.తిరుపతి, బి.మారుతి పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ధర్నా

- రెండు గంటలపాటు ధర్నాలో కూర్చున్న ఎమ్మెల్యే
- అధికారుల హామీతో విరమణ



తిప్పన్నపేటలో ఎస్సారెస్పీ అధికారులకు దండం పెట్టి మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మండలంలోని తిప్పన్నపేట, అనంతారం గ్రామ రైతులకు సాగునీరు అందడం లేదని నిరసిస్తూ జగిత్యాల ఎస్సారెస్పీ కార్యాలయం ముందు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో పాటు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీనుంచి నాలుగు రోజులుగా నీరు వస్తున్నా దిగువ రైతులకు అందడం లేదని, అంతర్గాం శివారులోని ఎస్కేప్ కొద్దిమేర ఎత్తితే అందుతుందని చెప్పారు. స్పందించిన అధికారులు వెంటనే సాగునీరు అందేలా చర్యలు చేపడతామని, తిప్పన్నపేట గ్రామానికి వెళ్లే రైతులకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎస్సారెస్పీ అధికారులు తిప్పన్నపేట గ్రామానికి వెళ్లి ఎస్సారెస్పీ కాలువను పరిశీలించారు. మండల ఉపాధ్యక్షుడు గంగం మహేశ్, గర్వందుల నరేశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపైనే దృష్టి పెట్టిన ఎక్సైజ్ శాఖ

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్రంలో మద్యం అమ్మకాలతో రూ.50 వేల కోట్ల మేరకు సాధారణ, పేద ప్రజలపై భారం పడుతోందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాబితాపూర్ గ్రామంలో మంగళవారం మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక ఎక్సైజ్ శాఖ ఎక్కువగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోందన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుస్తుండటంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మద్యం అమ్మకాలు రూ.8వేల కోట్లు ఉండగా.. ప్రస్తుతం రూ.20వేల కోట్ల ఆదాయం వస్తోందని చెప్పారు. పన్ను రూపంలో రూ.20 వేల కోట్లు, రూ.10 వేల కోట్లు మద్యం వ్యాపారులు అమ్మకాలతో లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. మద్యం, పెట్రోలియం జీఎస్టీ పరిధిలోకి రాలేవన్నారు. ఆదాయం ప్రధానంగా చూడకుండా ప్రభుత్వం జీఎస్టీని అమలు చేసి పన్నుల భారం తగ్గించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అల్గునూర్(మానకొండూర్): తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో హాస్టల్‌లో ఉండే అభ్యర్థులకు భోజనం సమకూర్చేందుకు క్యాటరర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ సబిత తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7660022509, 9866710702 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సర్టిఫికెట్ కోర్సుకు..

టవర్‌సర్కిల్(కరీంనగర్): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ బ్యాచ్ ప్రవేశాలకు ఈనెల 18వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ పి.నితిన్, కోర్స్ సమన్వయకర్త జి.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు అర్హులని, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంట్రెన్స్ ద్వారా అడ్మిషన్స్ నిర్వహించబడునని పేర్కొన్నారు. ఈనెల 19న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ రుసుము, ఎంట్రెన్స్ వివరాలకు 9949765315, 9866841329 నంబర్లలో సంప్రదించాలని, అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



పంచ్ పడితే పతకమే!



- ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో రాణిస్తున్న తెలుగుతేజం
- సూపర్ బాక్సింగ్ లీగ్‌లో ఉత్తమ ప్రతిభ
- దేశసేవ చేస్తూనే క్రీడల్లో రాణిస్తున్న జవాన్
- ఒలింపిక్స్ పతకమే లక్ష్యమంటున్న వెంకటేశ్వర్లు

ఎక్కడో మారుమూల తండాలో పుట్టిన ఆ యువకుడు అంతర్జాతీయ స్థాయి బాక్సర్‌గా ఎదిగాడు. దేశసేవ కోసం సైనికుడైనా.. తాను నేర్చుకున్న బాక్సింగ్‌ను వదల్లేదు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం డొక్కలబావి తండాకు చెందిన సఫావత్ వెంకటేశ్వర్లు ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో మన రాష్ట్రానికి పతకాల పంట పండిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

- తిరుమలగిరి నుంచి అశోక్



సాధించిన పతకాలతో వెంకటేశ్వర్లు..

ఆర్మీలో పనిచేస్తూనే..


నల్లగొండలోని మార్కోని ఐటీఐ కళాశాలలో చదువుతున్న సమయంలోనే బాక్సింగ్ వైపు మళ్లాడు వెంకటేశ్వర్లు. అప్పట్లో వన్‌టౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న జిలానీ.. వెంకటేశ్వర్లుకు అండగా నిలిచారు. చదువుకు అవసరమైన పుస్తకాలతోపాటు, బాక్సింగ్ కోచింగ్‌కు అన్ని విధాలా సాయం చేశారు. దీంతోపాటు మల్లేష్ మాస్టర్ వద్ద కోచింగ్‌తో మిషన్ ఆన్ రింగ్‌గా మారాడు. వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు గెలిచే స్థాయికి ఎదిగాడు. రెండుసార్లు ప్రొఫెషనల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రపంచ చాంపియన్ అయిన అమీర్‌ఖాన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నాడు వెంకటేశ్వర్లు. రక్షణ శాఖలో జవాన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు, సెలవుల్లో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటూ వివిధ వేదికలపై రాణిస్తున్నాడు.

అంతర్జాతీయ స్థాయికి..

- ఇటీవల ఢిల్లీలో జరిగిన సూపర్ బాక్సింగ్ లీగ్‌లో 57.5 కేజీల కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించాడు. సినీనటులు సునీల్‌శెట్టి, రాణాల బాహుబలి బాక్సింగ్ టీమ్‌లో దక్షిణ భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించిన ఏకైక ఆటగాడిగా గుర్తింపు పొందాడు.
- మూడుసార్లు ఆలిండియా నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. 2013లో తమిళనాడు కాట్‌పాడ్‌లో సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ పొందాడు.
- వెస్ట్‌బెంగాల్ దుర్గాపూర్‌లో జరిగిన ప్రెసిడెంట్ కప్‌లో ప్రతిభ చూపాడు.



ప్రొఫెషనల్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి 30 వరకు బ్యాంకాక్‌లో 52 కేజీల విభాగంలో జరిగే ట్రైనింగ్ కమ్ ఫైట్‌కు అర్హత సాధించాడు వెంకటేశ్వర్లు. ఈ పోటీల్లో దేశం తరపున కేవలం ఇద్దరికి మాత్రమే చోటు దక్కింది. వెంకటేశ్వర్లు ట్రైనింగ్ కమ్ ఫైట్‌లో విజయం సాధించాలని ఆశిద్దాం.



అందని ద్రాక్ష!

> ద్రాక్ష అధికంగా సాగయ్యే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ముఖ్యంగా ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తృతంగా పండించే వారు. అయితే కొన్నేళ్లుగా రైతులు ద్రాక్ష సాగుకు దూరంగా జరుగుతూ వస్తున్నారు.

> ఐదారేళ్ల క్రితం వరకు ఇక్కడి ద్రాక్షను విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో గణనీయంగా తగ్గిపోయిన ద్రాక్ష సాగు.. సంక్రాంతి తర్వాత మార్కెట్‌లోకి మహారాష్ట్ర సరుకు

గజ్వేల్ నుంచి యెన్నెళ్లి సురేందర్:

తెలంగాణలో ద్రాక్ష సాగుకు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలే ఆధారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా కొంత విస్తీర్ణం సాగయ్యేది. మొత్తంగా యేటా 50వేల ఎకరాలకుపైగా తోటలు సాగులోకి వచ్చేవి. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం ద్రాక్ష సాగులో సింహభాగాన్ని ఆక్రమించేది. విదేశాలకు ఎగుమతి చేసే సీడ్‌లెస్ థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు ఈ ప్రాంత రైతులు ప్రధానంగా సాగుచేసేవారు. విదేశాలకే కాకుండా కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా ద్రాక్ష ఎగుమతయ్యేది. కానీ ఈ ఏడాది దిగుమతి చేసుకోవాల్సిందే.

మహారాష్ట్ర నుంచి 'ద్రాక్ష'..

మహారాష్ట్రలో జనవరి మొదటి వారం నుంచి తోటలు కోతకు వస్తుంటాయి. తెలంగాణ జిల్లాల్లో ఫిబ్రవరి చివరి వారంలో కోతకు వస్తాయి. ఒకవేళ ఇక్కడ అడపాదడపా థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు సాగు చేసినా అవి గోళీల్లా గుండ్రంగా ఉంటాయి. కానీ మహారాష్ట్రలో సూపర్ సొనాక, మానిక్‌చమన్ లాంటి రకాలు చిటికన వేలు ఆకారంలో ఉండి మార్కెట్‌లో వినియోగదారుల్ని బాగా ఆకర్షిస్తున్నాయి. వీటి దెబ్బకు మన ద్రాక్ష తట్టుకోలేదు.

గణనీయంగా పడిపోయిన సాగు విస్తీర్ణం

2007, 2008 సంవత్సరాల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కోట్లల్లో నష్టపోయిన రైతులు ద్రాక్ష సాగంటేనే జంకే పరిస్థితి నెలకొన్నది. తెలంగాణలో అప్పట్లో 50,000 ఎకరాలకుపైగా ద్రాక్ష తోటలు సాగులోకి వస్తే... ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా, రంగారెడ్డి జిల్లా కలుపుకొని వెయ్యి ఎకరాలు కూడా సాగులోకి రావడం లేదు. ద్రాక్షతోటల స్థానంలో కాస్త లాభసాటిగా ఉండే కూరగాయల సాగుపై దృష్టి సారించారు. సంక్రాంతి తర్వాత మహారాష్ట్ర సరుకు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. ఈ ఏడాది కిలో ధర రూ.60 వరకు పలకనుందని అంచనా.

> ఉదాహరణకు గజ్వేల్ నియోకవర్గంలో 2008లో **1500** ఎకరాల్లో ద్రాక్ష సాగులో ఉండగా అది 2009, 2010లో **150** ఎకరాలకు తగ్గిపోయింది. 2013–14లో **40** ఎకరాలకు పడిపోయింది. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి మెదక్ జిల్లా మొత్తంగా చూస్తే సాగులో ఉన్నది వంద ఎకరాల్లోపే. ఇక్కడ తొమ్మిదేళ్లక్రితం మూడు వేల ఎకరాల్లో 'ద్రాక్ష' సాగైంది.

2006 వరకు ఓకే.. ఆ తర్వాతే..

ఎకరా ద్రాక్ష తోట సాగు చేయాలంటే పదేళ్ల క్రితం కూలీలు, ఎరువులు, ఫంగీసైడ్స్, ఇతర అవసరాలు కలుపుకొని రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి అయ్యేది. ప్రస్తుతం ఇది రెట్టింపైంది. ఇంత భారీ పెట్టుబడి పెట్టినా 2006 వరకు రైతులు లాభాలే గడించారు. 2007 నుంచి ద్రాక్ష తోటల సాగుకు సంబంధించి సీను ఒక్కసారిగా మారిపోయింది. ద్రాక్షతోటలు సాధారణంగా జనవరి రెండో వారం నుంచి ఏప్రిల్ నెలలో కోతకు వస్తుంటాయి. ఈ క్రమంలో 2007, 2008 సంవత్సరాల్లో సరిగ్గా కోతల సమయాల్లోనే అకాల వర్షాలు కురిశాయి. 2008లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. మార్చి 23 నుంచి 31 వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ పరిణామం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు మండలాల్లోనే కాకుండా రాష్ట్రంలో సాగవుతున్న ద్రాక్ష తోటలకు ఫంగస్ సోకి పళ్లన్నీ విషతుల్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మహారాష్ట్రలో ప్రభుత్వం అండ..

మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి ద్రాక్ష రైతులను ప్రోత్సహిస్తున్నది. కొత్తగా ద్రాక్ష సాగుకు సిద్ధమయ్యే రైతులకు బ్యాంక్ రుణం, ఫంగీసైడ్స్, ఫెస్టిసైడ్స్, ఆధునిక పరికరాలు, పందిరి అల్లడానికి వైరు, డ్రిప్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నది. ఒక వేళ రైతులు నష్టపోతే ఎకరాకు రూ. లక్ష వరకు పరిహారాన్ని అందిస్తున్నది. అంతేకాకుండా బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేస్తున్నది. వీటన్నింటికి తోడు రైతులకు మంచి మార్కెటింగ్ సౌకర్యాన్ని సైతం కల్పిస్తోంది.

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన పలువురు మహిళలు సేవా కార్యక్రమాలకు సంకల్పించారు. వెంటనే సమావేశమై సంఘంగా ఏర్పడ్డారు. దానికి 'వాసవీ వనిత క్లబ్' గా నామకరణం చేసుకున్నారు. పేదవారికి చేయూతనందిస్తూ... సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పలువురు మన్నలను పొందుతూ 'వని త'లూ శెభాష్ అనిపించుకుంటున్నారు.

సామాజిక సేవలో వనితలు


వాసవి వనిత క్లబ్ మహిళలు


హరితహారంలో మొక్కలు నాటుతున్న మహిళలు


వికలాంగుడికి వీల్‌చైర్ అందిస్తున్న క్లబ్ సభ్యులు

2012లో ఏర్పాటు...

జమ్మికుంటకు చెందిన రైస్‌మిల్ వ్యాపారి గర్రెపల్లి రాజమౌళి సతీమణి అరుణాదేవికి సామాజిక సేవ చేయాలని ఆలోచన తట్టింది. అనుకున్నదే తడువుగా.. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మహిళలతో చర్చించింది. వారి నుంచి మంచి స్పందన రావడంతో 2012లో 'వాసవి వనిత క్లబ్'ను ఏర్పాటు చేశారు. 50 మందితో ప్రారంభమైన క్లబ్ అనేక సామాజిక కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం క్లబ్‌లో 100 మంది సభ్యులు ఉన్నారు.

'సాక్షి' కథనంతో..

జమ్మికుంటకు చెందిన గుగ్గిళ్ల వాణి..శ్రీవాణి అక్కా చెల్లెల్లు. చిన్నతనంలో ఇద్దరూ నరాలకు సంబంధించిన వ్యాధితో మంచాన పడ్డారు. 2013లో వీరి ధీనగాథపై 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందిచిన వాసవి వనిత క్లబ్ మహిళలు రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న పలువురు ముందుకొచ్చి రూ. 4 లక్షల వరకు సాయం చేశారు. అప్పటి నుంచి ప్రారంభమైన క్లబ్ సామాజిక కార్యక్రమాలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

వీరు అందించిన సేవలివే...

జమ్మికుంట పట్టణంలో ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఏటా నోటు బుక్కులు, పెన్నులు అందిస్తున్నారు. మానసిక విద్యార్థులకు బట్టలు, ప్లేట్లు, గ్లాస్‌తో పాటు ఆర్థికంగా ఆదుకుంటున్నారు.పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ఆర్థికసాయంతో పాటు పుస్తె, మెట్టలు అందిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద రూ.50వేలతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయించారు. కాన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద రూ. 50 వేలతో ముఖ ద్వారం ఏర్పాటు చేశారు. ఏటా జనవరి 26, ఆగస్టు 15కు పేదలకు చేయూతనందిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ముగ్గులపోటీలు నిర్వహిస్తూ యువతుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా మందులు అందిస్తున్నారు.

వేసవిలో చలివేంద్రాలు

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో, ఆలయాల్లో వాటర్‌కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు బియ్యం పంపిణీ, ఆలయాల్లో అన్నదానం చేస్తున్నారు. మహిళా, మాతృదినోత్సవం, గాంధీ జయంతికి ఉచితంగా కుట్టుమిషన్లు, వికలాంగులకు వీల్‌చైర్స్, చెవుడు పరికరాలు అందిస్తున్నారు. ఇవే కాకుండా ఏటా లక్షల రూపాయలకు సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఇందుకోసం సభ్యులందరూ సమానంగా వెచ్చిస్తుంటారు.

ఎన్నో కార్యక్రమాలు..



క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేను అధ్యక్షురాలిగా పనిచేసిన సమయంలో క్రీడాకారులకు సామగ్రి, పేదలకు ఆర్థికసాయం అందించాం. మహిళలంతా కలిసి ఇలా ముందుకు సాగడంలో ఆనందం ఉంటుంది.ఈ అవకాశం మరిచిపోలేనిది.

– ముక్క మాధవి, మాజీ క్లబ్ అధ్యక్షురాలు

సేవ చేయాలనే...



ప్రజాసేవలో మహిళలూ మా వంతు పాత్ర పోషించాలని 2012లో క్లబ్ ఏర్పాటు చేశాం. అప్పటి నుంచి క్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పేదలకు సహాయ, సహకారాలు అందిస్తే మనసు తృప్తిగా ఉంటుంది. మహిళలు ఎందులో తీసిపోరు అనేదానికి మా సంస్థ స్ఫూర్తిదాయకం.

– గర్రెపల్లి అరుణదేవి, క్లబ్ డెప్యూటీ గవర్నర్, జమ్మికుంట

సేవలోనే సంతోషం



ఏడాదికాలంగా క్లబ్‌అధ్యక్షురాలిగా సేవాకార్యక్రమాలు అందిస్తున్నా. పేదలకు, అభాగ్యులకు, అపదలో ఉన్నవారికి సేవ చేయడంలో కలిగే ఆనందం అంతాఇంతా కాదు. చేయూతనందుకుంటున్న వారి కళ్లల్లో కన్పించే అనందాన్ని చూస్తుంటే మరింత సేవ చేయాలనే అలోచన ఉంటుంది.

– గౌరిశెట్టి అపర్ణ, క్లబ్‌అధ్యక్షురాలు, జమ్మికుంట



మహిళా

చైత

- ఆర్థిక స్వావలంబనలో సిరిసిల్ల మహిళలు ప్రథమం •
- సమాజ సేవలో జమ్మికుంట వనితలు • ఆరేళ

'ఆమె' ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేస్తోంది. ఇంటాయనపై ఆ
పడానికి తన వంతు సాయం అందిస్తోంది. రాజన్న సిరిసి
ఏర్పడి 'స్త్రీనిధి' ద్వారా రుణాలు పొంది, వాటిని సద్వినియో
సాధించారు. రెండేళ్లలో సుమారు రూ.12కోట్లకు పైగా లక్ష
99.8శాతం రికవరీ నమోదు చేశారు. రాష్ట్రస్థాయిలో అగ్ర
సొంతం చేసుకున్నారు. జమ్మికుంటకు చెందిన పలువురు
నివ్వాలని సంకల్పించారు. సంఘంగా ఏర్పడి పలు సేవా
అంటూ ముందుకొస్తున్నారు. ఎన్నో సామాజిక కార్యక్రమ
నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థికంగా బలపడుతున్న
సేవా ధృక్పథంతో ముందుకెళ్తున్న జమ్మికుంట మహిళామ



...స్ఫూర్తి..

మహిళ

...కీర్తి

...మహిళా సంఘాలకు దక్కిన 'స్త్రీనిధి' అవార్డు
...ల్లగా స్ఫూర్తిదాయక కార్యక్రమాలు

...ఆధారపడకుండా ఇంటిబండిని నడ
...ల్లలోని మహిళలు సంఘాలుగా
...గాగం చేసుకుని ఆర్థిక సాధికారత
...క్ష్యానికి మించి రుణాలు పొంది..
...స్థానంలో నిలిచి స్త్రీనిధి అవార్డు
...మహిళలు పేదలకు చేయూత
...కార్యక్రమాల్లో 'మేముసైతం'
...లు నిర్వహించి ఆదర్శంగా
... రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళలు..
...ణులపై కథనం...

స్వశక్తి చాటారు..

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా సంఘాల్లో ఆర్థిక చైతన్యం వచ్చింది. రుణాలు తీసుకోవడమే కాదు.. వాటిని సకాలంలో, సక్రమంగా తీర్చడంలోనూ ఆదర్శంగా నిలిచాయి. తీసుకున్న సొమ్మును సద్వి నియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాయి. 'స్త్రీనిధి' ద్వారా గత రెండేళ్లలో సుమారు రూ.12కోట్లకు పైగా లక్ష్యానికి మించి రుణాలు పొందాయి. 99.8శాతం రికవరీ నమోదు చేశాయి. దీంతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాయి. స్త్రీనిధి అవార్డు సొంతం చేసుకున్నాయి.

ఆర్థికాభివృద్ధికి 'స్త్రీనిధి'..

రుణాలు పొందిన మహిళా గ్రూపుల్లోని సభ్యుల వాటాధనంతో వారి వ్యక్తిగత అవసరాలు, వ్యాపారాభివృద్ధి, సామాజిక అవసరాల నిమిత్తం నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం స్త్రీనిధి బ్యాంకు ఏర్పాటు చేసింది. పట్టణ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలు(మెప్మా,సెర్ప్) ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా ఏడాదికి 12.5శాతం వడ్డీతో రూ.25వేల వరకు రుణం ఇస్తున్నారు. ఒక్కో సంఘంలోని ఆరుగురు సభ్యులకు వీటిని అందజేశారు.

'స్త్రీనిధి' ద్వారా ప్రయోజనాలు..

స్త్రీనిధి రుణం పొందడానికి మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. స్వశక్తి గ్రూపు సభ్యురాలై ఉండి..ఆన్‌లైన్ ద్వారా రుణానికి దరఖాస్తు చేసుకోవాలి. బ్యాంకర్లు ఆర్జీని విచారించి కేవలం 48గంటల్లోనే దరఖాస్తుదారుల బ్యాంకు అకౌంట్లో సొమ్ము జమచేస్తారు. అంతేకాదు.. రుణం పొందిన వారి పేరిట ప్రభుత్వం రూ.200 బీమా పథకం అమలు చేస్తోంది. తద్వారా రుణగ్రహీతలు ప్రీమియం చెల్లించకముందే.. అకాల మరణం పొందితే మిగతా సొమ్ము మాఫీ అవుతుంది. రుణ మొత్తాన్ని వ్యాపారాభివృద్ధికే కాకుండా పిల్లల చదువులు, కుటుంబసభ్యుల ఆరోగ్యం, ఇతర సామాజిక అవసరాలకూ వినియోగించొచ్చు.

స్త్రీనిధి బ్యాంకులో సమాఖ్యలు	562
సిరిసిల్ల పట్టణ సమాఖ్యలు	75
స్వశక్తి సంఘాల సభ్యులు	18,000

వడ్డీలేని రుణం తరహాలోనే..

సభ్యులు తీసుకున్న రూ.25 వేల రుణ మొత్తానికి ఏడాదికి 12.5శాతం వడ్డీ కట్టినా.. వాటి నుంచి 1.5 శాతం ఏడాదికోసారి బ్యాంకు సభ్యులకు డివిడెండ్ చెల్లిస్తుంది. మిగతా వడ్డీ మొత్తాన్ని సభ్యుల పేరిట బ్యాంకు ఖాతాలో నిర్ణీత గడువు ప్రకారం జమచేస్తుంది. రెండేళ్లపాటు కిస్తీలు చెల్లించే వరకు సభ్యులకు బీమా షరతులు వర్తిస్తాయి. పట్టణంలో 75 సమాఖ్యలుండగా ఇందులో 18వేల మంది సభ్యులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇందులో 40శాతం మంది మహిళలు స్త్రీనిధి రుణాలు పొందారు. రెండేళ్లుగా 99.8 శాతం రికవరీ నమోదు చేస్తున్నారు. దీంతో గత డిసెంబర్ 29న హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ మంత్రి జూపెల్లి కృష్ణారావు, మెప్మా ఎండీ శ్రీదేవి ద్వారా మెప్మా పీడీ కేవీ రమణాచారి, ఏడీఎంసీలత, టీఎంసీ రాజమణి, ఆర్‌ఎంటీవీ రవికుమార్ అవార్డును అందుకున్నారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం(రూ.కోట్లలో)

ఏడాది	లక్ష్యం	ఇచ్చింది
2016-17	4.26	5.78
2017-18	10	6.13
రెండేళ్లుగా రికవరీ శాతం	99.8	

రెండుసార్లు రుణం తీసుకున్న



రెండేళ్ల క్రితం మా ఆయనతో కలిసి మెడికల్ ఏజెన్సీ ప్రారంభించాం. స్వశక్తి సంఘం నుంచి రుణం తీసుకున్నం. ఆ తర్వాత స్త్రీనిధి ద్వారా రెండుసార్లు రూ.25 వేలు చొప్పున రుణం పొందినం. ప్రతినెలా 20వ తారీఖున కిస్తీ చెల్లిస్తున్నం.

– వెంగళ ఉమ, మెడికల్ ఏజెన్సీ, సిరిసిల్ల

తెలంగాణలోనే 'స్త్రీనిధి'



స్త్రీనిధి బ్యాంకు కేవలం తెలంగాణలోనే ఉంది. స్వశక్తి సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూతతో పాటు సామాజిక అవసరాలు తీర్చేందుకు ఈబ్యాంకు దోహదం చేస్తుంది. మన జిల్లా మహిళలు రుణాలు తీసుకోవడం, చెల్లించడంలో రికార్డు నెలకొల్పడం అభినందనీయం. మహిళలు ఇలా ముందుకెళుతూ ఇతర రాష్ట్రాల వారికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నా.

– కేవీ రమణాచారి, మెప్మా పీడీ, సిరిసిల్ల

ఐదుదశల్లో అవార్డులు



స్త్రీనిధి అవార్డులను ఐదుదశల్లో గెలుచుకున్నాం. రుణగ్రహీతలు సక్రమంగా కిస్తీలు చెల్లించడమే కాకుండా వాటిని సద్వినియోగం చేసుకోవడం సంతోషదాయకం. జిల్లానుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడం అదే ప్రోత్సాహంతో ఉత్సాహంగా ముందుకు సాగడం అవార్డుకు సహాయ పడింది.

– నాగుల సుమలత, ఏడీఎంసీ

స్త్రీనిధి అవార్డు తీసుకుంటున్న మెప్మా పీడీ కే.వి.రమణాచారి, సిబ్బంది





మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఉమ



శిథిలావస్థలో సింగరేణి క్వార్టర్లు

భయాందోళనలో కార్మిక కుటుంబాలు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని బస్టాండ్ కాలనీలో సింగరేణి క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతాయోనని కార్మికులు, వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారుల మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. గోదావరిఖని పట్టణంలో కార్మికుల నివాసానికి అనుకూలంగా ఉంటుందని సింగరేణి యాజమాన్యం 1991లో బస్టాండ్ కాలనీలో క్వార్టర్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో 302 టీ2 టైపు, 1995లో 180 ఎస్‌టీ–2 టైపు క్వార్టర్లను నిర్మించారు. టీ2 టైపు క్వార్టర్లు నిర్మించి 26 ఏళ్లు, ఎస్‌టీ–2 టైపు క్వార్టర్లు నిర్మించి 22 ఏళ్లు అవుతున్నా.. వాటికి పూర్తిస్థాయి మరమ్మతులను చేపట్టడం లేదు. 'కార్మికుల వద్దకు యాజమాన్యం' కార్యక్రమాన్ని నిర్వహించిన క్రమంలో అధ్వానంగా ఉన్న క్వార్టర్ల గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యలను పుస్తకాల్లో నమోదు చేసుకున్నారే తప్ప శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

పెచ్చులూడుతున్నాయి..

బస్టాండ్ కాలనీలోని సింగరేణి క్వార్టర్ల గురించి యాజమాన్య పర్యవేక్షణ లోపించడంతో క్వార్టర్ల మధ్యలో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. వాటి వేర్లు క్వార్టర్ల గోడల లోపలికి చొచ్చుకుని వస్తూ పగిలిపోయి పెచ్చులూడి పడుతున్నాయి. క్వార్టర్లకు మరమ్మతులు లేకపోవడంతో బెడ్‌రూమ్‌లు, వంట గదులు, బాతురూమ్‌లు, మరుగుదొడ్లలో పైకప్పులు కూలిపోతూ కార్మిక కుటుంబాలపై పడుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు జరిగాయని, యాజమాన్యం పట్టించుకోవడం లేదని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. క్వార్టర్ల మధ్యలో నిర్మించిన డ్రైనేజీ నిర్మాణాలు కూడా సరిగ్గా లేకపోవడం, కుండీల్లోని మురుగు సరిగ్గా వెళ్లకుండా నిలిచిఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని


గోడలకు పగుళ్లు తేలి శిథిలావస్థలో ఉన్న సింగరేణి క్వార్టర్లు

వారు చెబుతున్నారు. దీనికితోడు డ్రైనేజీ కుండీలపై మూతలు లేకపోవడంతో చెత్తాచెదారం కుండీల్లో నిండిపోయి మురుగునీరు నిలిచిపోతోంది. క్వార్టర్లకు చాలా ఏళ్లుగా సున్నం వేయకపోవడంతో గోడలన్నీ నల్లటి మరకలతో కనిపిస్తున్నాయి. ఎవరైనా క్వార్టర్లలోకి కొత్తగా వస్తే క్వార్టర్ లోపలి భాగంలో మాత్రమే సున్నం వేసి బయట వేయకుండా వదిలేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే క్వార్టర్ బయట సున్నం వేయడం సింగరేణి రూల్‌లో లేదని అధికారులు చెబుతున్నారని కార్మికులు వాపోతున్నారు. మొత్తంగా బస్టాండ్ కాలనీలోని సింగరేణి క్వార్టర్లకు మరమ్మతులు చేయకపోతే పైకప్పులు కూలి కార్మికులు, వారి కుటుంబాల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం పొంచిఉంది.

'బడికెల'కు సంజాయిషీ నోటీసు


బడికెల రాజలింగం

జ్యోతినగర్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు బడికెల రాజలింగంకు రాష్ట్ర కార్యదర్శి ఏ.నరసింహారావు సంజాయిషీ నోటీసును జారీ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఐఎన్‌టీయూసీ యొక్క పేరు, లోగోను వ్యక్తిగత హోదాకు వాడుకోవడం, ఐఎన్టీయూసీ అనుబంధంగా అధికారికంగా నడుపబడుతున్న కార్మిక సంఘాల కార్యకలాపాలకు ఆటంకం కలిగించే విధంగా వ్యక్తిగతంగా వివిధ సంస్థలకు ఉత్తరాలు రాయడాన్ని తప్పుబట్టారు. తదుపరి చర్యల నిమిత్తం లిఖిత పూర్వక సంజాయిషీ కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ పనులు నిర్వహిస్తున్న కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు, ఏజెన్సీలకు లేఖలు వ్రాశారని, అందులో ఎటువంటి ఆధారాలు లేని క్యాటగిరి వైజ్ వేతనాల ప్రపోజల్స్‌ను రాసి వాటిని అమలు చేయకుంటే ఆ కార్యాలయాల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని బెదిరించే విధంగా ఉన్నట్లు జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి దృష్టికి వచ్చింది. ఆయన ఆదేశాల మేరకు సంజాయిషీ నోటీసును జారీ చేస్తున్నట్లు ప్రకటించారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు


గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న సీపీ విక్రమ్‌జీత్ దుగ్గల్

కోల్‌సిటీ: మూడవ సౌత్ ఆసియన్ ఇంటర్నేషనల్ కరాటే, కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్–2017 పోటీలలో పతకాలు సాధించిన గోదావరిఖని విద్యార్థులను మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ అభినందించారు. ఢిల్లీలోని తాల్‌కతోర ఇండోర్ స్టేడియంలో గత నెల 28న, మూడవ సౌత్ ఆసియన్ ఇంటర్నేషనల్ కరాటే, కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్–2017 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గోదావరిఖనిలోని స్పార్క్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమికి చెందిన 10మంది విద్యార్థులు పాల్గొనగా, ఆరుగురు విద్యార్థులు పతకాలు కైవసం చేసుకున్నారు. 11ఏళ్ల విభాగంలో వి.అన్నమాచార్య (గోల్డ్), ఎ.మణికంఠ (సిల్వర్), 12ఏళ్ల విభాగంలో ఎండీ వహీజారిజ్వానా (గోల్డ్), 10ఏళ్ల విభాగంలో ఎస్‌కే యాషిర్ (సిల్వర్), 8ఏళ్ల విభాగంలో ఎస్‌కే షాఫీ (బ్రౌంజ్), ఎండీ జాఫర్ రెహమాన్ (బ్రౌంజ్) మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో మాస్టర్ ఎం.రాజేశం, కె.రాములు, ఎన్.కుమార్ పాల్గొన్నారు.

మీట్ యువర్ జీఎం కార్యక్రమంలో సమస్యల వెల్లువ


జీఎంకు సమస్యలను వివరిస్తున్న కార్మికులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం ఏరియా–1 పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం మీట్ యువర్ జీఎం కార్యక్రమం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం వి.విజయ్‌పాల్‌రెడ్డి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 12 కార్మికులు దరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించి ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం ఎ.సుధాకర్‌రెడ్డి, పర్సనల్ డీజీఎం బి.హనుమంతరావు, ఈఅండ్‌ఎం ఏజీఎం ప్రసాద్‌రావు, సివిల్ డీజీఎం నవీన్, ఏజెంట్ మనోహర్, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం శేషుకుమార్, సీనియర్ పీఓ గంగాధర్, వీరారెడ్డి, సంక్షేమాధికారులు శ్రీనివాస్, సారంగపాణి, కిరణ్‌కుమార్, యోగేశ్ పాల్గొన్నారు.

ఉద్యమాల దిక్సూచి బర్ధన్


బర్ధన్‌కు నివాళులర్పిస్తున్న గట్టయ్య

గోదావరిఖని: కార్మిక పక్షపాతి, ప్రజా ఉద్యమాల దిక్సూచి ఏబీ బర్ధన్ అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వై.గట్టయ్య అన్నారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో మంగళవారం బర్ధన్ రెండో వర్ధంతి సభ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ బర్ధన్ బెంగాల్‌లో జన్మించినా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కార్మిక ఉద్యమాలు నిర్వహిస్తూ అనేక కార్మిక సంఘాలను నిర్మించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్మికులంతా కలిసి మహారాష్ట్రలో రూ.20 లక్షల చెక్కుని ఇస్తే దానిని ప్రభుత్వ పాఠశాలకు విరాళంగా ఇచ్చిన మహోన్నతమైన వ్యక్తి బర్ధన్ అని అన్నారు. సీపీఐలో మూడు పర్యాయాలు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్మించిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి గోసిక మోహన్, తాళ్లపెల్లి మల్లయ్య, మామిడి ఆగయ్య, బోడకుంట కనుకయ్య, పడాల కనకరాజ్, మార్కపూరి సూర్య, తోడవనూరి రమేష్, వెంకట్‌రెడ్డి, రామస్వామి, అనురాజ్, జహూర్, వనపాకల విజయ్, భూమయ్య, పరమాత్మ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఆర్జీ–2 జీఎం విజయబాబు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎం విజయబాబు

యైటింక్లయిన్‌కాలనీ: నూతన సంవత్సరం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్‌ను మంగళవారం ఆర్జీ–2 జీఎం విజయబాబు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో సంస్థ అభివృద్ధిలో పోలీస్ భాగస్వామ్యం ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఏసీపీ అపూర్వారావును కూడా కలిసి అభినందనలు తెలిపారు. జీఎం వెంట ఎస్ఓటూ జీఎం రవీందర్, ఎస్ఎస్ఓ జానకిరాం పాల్గొన్నారు.

బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు ?

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ కార్మికులు కోండ్ర సత్యనారాయణ, గుంపుల కుమారస్వామి, పులి కొమురయ్య, కోట మల్లయ్య, బాలయ్య, పుల్లయ్య, సాంబమూర్తి, శంకర్‌నాయక్, నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు తమ గోడును వెలిబుచ్చారు. విత్ పే లీవుల డబ్బులు, సీఎంపీఎఫ్, ఈపీఎఫ్, ఎన్‌పీఎఫ్ డబ్బులు చెల్లించడంలో యాజమాన్యం జాప్యం చేస్తోందన్నారు. ఉద్యమంలో భాగంగా 35రోజుల సమ్మె వేతనం చెల్లించలేదన్నారు. టీబీజీకేఎస్ యూనియన్ వల్ల రిటైర్డ్ అయిన 15రోజుల్లోపే క్వార్టర్స్‌ను ఖాళీ చేయిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, సంస్థ సీఅండ్‌ఎండీ స్పందించి సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. లేకుంటే సింగరేణి వ్యాప్తంగా ఉన్న రిటైర్డ్ కార్మికులను ఏకం చేసి ఏరియా వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తపన ఉంటేనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్సీ భానుప్రసాదరావు


మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

జూలపల్లి(పెద్దపల్లి): తపన ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ భానుప్రసాదరావు అన్నారు. నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే లక్ష్యం చేరుకోవచ్చన్నారు. ఇంటర్ విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ మధ్యాహ్న భోజనం అందించడం అభినందనీయమన్నారు. జూలపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సీఎం దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వెంకటయ్య జెడ్పీటీసీ ప్రీతి, కోఆప్షన్ సభ్యుడు ఫజలుల్లా, ఏఎంసీ వైస్‌చైర్మన్ చొక్కారెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గంగాధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎం ఉదయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.


ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూత

గోదావరిఖనిటౌన్: ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో అలింకో సంస్థ వారి సహకారంతో మంగళవారం స్థానిక పాత మున్సిపాలిటీ కార్యాలయంలో దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 2, 3 తేదీల్లో నిర్వహించే క్యాంప్‌లో సంస్థ నుంచి వీరికి ఉచితంగా పరికరాలను అందించనున్నట్లు సంస్థ ప్రతినిధి పారమిత తెలిపారు. కార్యక్రమంలో మహిళ, శిశు, వికలాంగ వృద్ధుల జిల్లా ఆర్గనైజర్ మూల విజయారెడ్డి, టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సత్యప్రసాద్, సీడీపీవో స్వరూప, పాల్గొన్నారు.

అంకెలు కలపండి రంగులు వేయండి



పక్కన కింద ఇచ్చిన బొమ్మల పేర్ల మొదటి అక్షరాలను వాటి పైన ఉన్న ఖాళీ గళ్లలో రాయండి. పక్కనే ఉన్న కొంగ పేరు ఇంగ్లీషులో వస్తుంది. కనుక్కోండి. →




కనుక్కోండి

గుర్తించండి


కింద మధ్యలో ఉన్న రంగుల బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి. ↓





పైన ఉన్న A కింద ఉన్న Z దగ్గరకు వెళ్లాలి. దారి చూపండి.


కింద ఇచ్చిన గుడ్డులోనుంచి వస్తున్న బాతు బొమ్మను పక్కన ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



జవాబులు: కనుక్కోండి: Flamingo గుర్తించండి: F

నాన్నా చెప్పవా

సౌర మండలానికి అవతల అన్నీ పెద్ద గ్రహాలే ఉంటాయా?




మన సౌరమండలంలో సూర్యుని చుట్టూ నిర్దిష్ట కక్ష్యలలో పరిభ్రమిస్తూ 8గ్రహాలు, 166కు పైగా ఉపగ్రహాలు, కొన్ని మరుగుజ్జు గ్రహాలు, కొన్ని వేల కోట్ల సంఖ్యలో ఆస్టరాయిడ్లు, తోక చుక్కలు, ఉల్కలు వంటి ఖగోళ నిర్మాణాలు, ఇంకా అపారమైన నక్షత్ర ధూళి ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. మన సౌరమండలానికి వెలుపల కూడా ఇతర నక్షత్రాల వద్ద ఇలాంటి ఖగోళ నిర్మాణాలు ఉండి ఉండవచ్చునని అంచనా వేసిన శాస్త్రజ్ఞులు, ఆ దిశగా, అంటే అలాంటి వాటి ఉనికిని కనుగొనే దిశగా తమ ప్రయత్నాలను ఏనాడో మొదలుపెట్టారు.

1995లో తొలిసారిగా సౌరమండలానికి వెలుపల వేరే నక్షత్రం చుట్టూ తిరిగే ఒక గ్రహాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. దీనికి '51 Pegasi B' అని పేరు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా వేరే నక్షత్రాల చుట్టూ పరిభ్రమించే అలాంటి 200కు పైగా గ్రహాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అయితే ఇటీవల కనుగొన్న ఒక గ్రహాన్ని తప్పించి మిగతా వాటినన్నింటినీ పరోక్ష పద్ధతిలోనే కనుగొనడం జరిగింది. ఒక నక్షత్రం చుట్టూ పరిభ్రమించే ఒక గ్రహం దాని పరిభ్రమణంలో భాగంగా అప్పుడప్పుడూ ఆ నక్షత్రానికి అడ్డుగా వచ్చి, దాని కాంతిని కొంచెం మందగింప జేస్తుంది. సరిగ్గా దీనిని, ఇలాంటి మరి కొన్ని కారణాలను ఆధారంగా చేసుకునే శాస్త్రజ్ఞులు ఇతర నక్షత్రాలకు సంబంధించిన గ్రహాలను కనుగొంటున్నారు.

ఇప్పటి వరకు శాస్త్రజ్ఞులు కనుగొన్న ఇతర నక్షత్రాల గ్రహాలన్నీ మన గురుగ్రహం, లేదా అంతకన్నా ఎంతో పెద్దగా ఉండడం విశేషం. ఇటీవల శాస్త్రజ్ఞులు ప్రత్యక్ష పద్ధతిలో (ఫొటోల ద్వారా) కనుగొన్న ఓ గ్రహం మన గురుగ్రహం అంత పెద్దగా ఉండటమే గాక, దీనికి 8 రెట్లు ఎక్కువ ద్రవ్యరాశితో వుంది.

ఏ నక్షత్రానికి చెందిన గ్రహాలైనా, మన సౌరమండలానికి చాలా దూరంగా (కొన్ని వేల కోట్ల మైళ్ళు) ఉండే కారణంగా కేవలం భారీ సైజులోను,, అధిక ద్రవ్యరాశితోను వుండే గ్రహాలు మాత్రమే మన కంటపడుతున్నాయని, మన సాంకేతిక విజ్ఞానం మరింత అభివృద్ధి చెందినప్పుడు సుదూర ప్రాంతాలలో ఉండే చిన్న చిన్న గ్రహాలను కూడా కనిపెట్టడానికి వీలవుతుందని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

కింద ఉన్న రెండు బొమ్మల మధ్య 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.





ఎంసీఏ

శ్రీనివాస్
(పెద్దపల్లి –222 756) 11.30, 2.30, 6.30, 9.30

హలో!

సంగీత
(పెద్దపల్లి –222 756) 11.30, 2.30, 6.30, 9.30)

లక్ష్మీనృసింహునికి పంచామృతాభిషేకాలు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి పంచాయతీ దేవునిపల్లి శ్రీ లక్ష్మీనర సింహస్వామికి మంగళవారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రతి పౌర్ణమినాడు స్వామికి యాదగిరిగుట్ట ఆలయంలో నిర్వహిస్తున్న తీరునే ఇక్కడి ఆల యంలోనూ పూజలు నిర్వహిస్తుంటామని అర్చకులు శ్రీకాంతచార్యులు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమయజ్ఞం నిర్వ హించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయంలో నూతనంగా నవగ్రహ మండపం, నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రామాచార్యులు, లక్ష్మినారాయణాచార్యులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీఎస్‌టీఎస్ చైర్మన్



సీఎం కేసీఆర్‌తో రాకేశ్‌కుమార్

పెద్దపల్లిటౌన్: నూతన సంవత్సరాన్ని పుర స్కరించుకుని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల రాకేశ్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్

పెద్దపల్లిటౌన్: పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌గా జి.శ్రీనివాసన్ మంగళవారం బాధ్యతలు స్వీక రించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇప్పటివరకు కమిషనర్‌గా పని చేసిన సత్యనారాయణ నుంచి శ్రీనివాసన్ బాధ్యతలు తీసుకున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనివాసన్ పదోన్నతి బదిలీపై గ్రేడ్–3 మున్సిపల్ కమిషనర్‌గా ఇక్కడికి వచ్చిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపా లిటీని రాష్ట్రంలో నంబర్‌వన్‌గా నిలిపేందుకు అందరి సహకారంతో తనవంతు కృషి చేస్తా నన్నారు. నూతన కమిషనర్‌కు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పాలకవర్గం అభినం దనలు తెలిపింది.

రెండోవిడత గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి



1బీ నకల్‌ను అందజేస్తున్న తహసీల్దార్ సురేశ్

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహి స్తున్న భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రెండోవిడత గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆర్.సురేశ్ అన్నారు. మండలంలోని నర్సాపూర్, లోకపేట గ్రామాల్లో రెండోవిడత భూ రికార్డుల శుద్ధీకరణ గ్రామసభ లను మంగళవారం నిర్వహించారు. మొదటి విడతగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో రైతులనుంచి స్వీకరించిన దర ఖాస్తులను పరిశీలించిన అనంతరం సవరణలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతుల ఖాతా వివరాలు, 1బీ పహణీ నకల్ లను తప్పు, ఒప్పులను సవరించారు. సవరించిన జాబితాను రెండోవిడత రైతులకు అందజేస్తామని వాటిని సరిచూసుకుని సహకరించాలని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచులు వొద్ది పర్వాదరావు, రాసూరి దేవపాల, ఎంపీటీసీ విజయ, ఉప సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఆర్ఐ అమ్జద్, వీఆర్వో లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచులు ఎంపిక



బి.రాజమల్లయ్య

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల సర్పంచ్ బి.రాజమల్లయ్య, కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్ల సర్పంచ్ ఎ.శంకర్‌గౌడ్‌ను ఉత్తమ సర్పంచులుగా ఎంపిక చేసినట్లు డీపీవో సుదర్శన్ ప్రకటించారు. వీరు ఈనెల 3న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం ఆన్ థిమాటిక్ ఏరియాస్ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి ప్రతిభ కనబర్చినందుకు ఎంపిక చేసినట్లు డీపీవో ప్రకటించారు.

వ్యాసరచన పోటీలు

పెద్దపల్లిఅర్బన్: సావిత్రిబాయి పూలే 187వ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ప్రస్తుత సమాజంలో స్త్రీ పాత్ర అనే అంశంపై ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో పోటీలు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బాలసాని లెనిన్, రాజశేఖర్, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, అభి, సుమన్ పాల్గొన్నారు.

పక్కాభవన నిర్మాణం నిలిపేయాలి

ఓదెల: మండలంలోని మడకలో పాల ఉత్పత్తిదారుల సంఘం పక్కాభవనం నిర్మాణ పనులను నిలిపేయాలని ఎంపీటీసీ రాపోలు హన్మంతరావు, ఉప సర్పంచ్ నంద క్రాంతికుమార్ మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సర్వేనంబర్‌3లో గ్రామస్తుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా పాల ఉత్పత్తి దారుల సంఘం పక్కాభవనం పనులను ప్రారంభించారని వెంటనే ఆపివేయాలని పేర్కొ న్నారు. సర్పంచ్ ఆవుల గట్టమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంటకు చెందిన ముక్కెర శ్రీనివాస్ కుటుంబానికి టీటీఆర్ ఫౌండేషన్ బాధ్యులు రూ.2వేల ఆర్థికసా యాన్ని మంగళవారం అందజేశారు. బతుకమ్మ పండుగ రోజున ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై ముక్కెర శ్రీనివాస్ మరణించడంతో ఆయన భార్య స్వరూపకు గత మూడు మాసాలుగా ప్రతినెల రూ. 2వేలు అందిస్తు న్నట్లు పేర్కొన్నారు. నాయకులు నాగరాజు, భాస్కర్, సంజీవ్, శ్రీనివాస్, రమేశ్, ఉమేశ్, అనిల్, లలిత్, విజయ్, శ్రీనివాస్, లచ్చయ్య పాల్గొన్నారు.

ఏబీ బర్దన్ వర్ధంతి

పెద్దపల్లిఅర్బన్: మాజీ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ రెండో వర్ధంతిని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్దన్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవిత చరమాంకం వరకు ఏబీ బర్దన్ చేసిన పోరాటం భావి తరాలకు స్ఫూర్తి ప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు మద్దెల దినేష్, అక్కెపల్లి మాన సకుమార్, తోట బాలమల్లయ్య, చంద్రగిరి ఉదయ్, వెంకటేష్, రాకేష్, శ్రావన్, శేర్ల తిరుపతి, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

Zone Guide

నేడు సావిత్రీబాయి పూలే జయంతి

పెద్దపల్లిటౌన్: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్క రించుకుని పెద్దపల్లి ఐబీ అతిథి గృహంలో బుధవారం వేడు కలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్య క్షుడు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాజయ్య, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పాల్గొంటారన్నారు.

పొత్కపల్లిలో రెవెన్యూ గ్రామసభ

ఓదెల: ఓదెల మండలం పొత్కపల్లి, శానగొండ, గూడెం గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ గ్రామసభలు బుధ వారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి. శ్రీనివాసరావు తెలిపారు. రైతులు వారి సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన పేర్కొన్నారు.

ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షుడిగా సంపత్



పెద్దపల్లిటౌన్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత పెద్దపల్లి జిల్లా అధ్యక్షు డిగా చొప్పరి సంపత్‌కుమార్‌ను నియ మిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసంద ర్భంగా సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో యువత జిల్లా బాధ్యతలు అప్పగించిన మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బల్ల సత్తయ్య, నాయకులు పుట్ట మొండయ్య, కొలిపాక రాయమల్లు, లక్ష్మినర్సయ్య, గరిగంటి నర్సింహా రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండలంలోని తొగర్రాయి మానేరు తీరాన ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద సర్పంచ్ క్యాదాసి పద్మ ఆధ్వ ర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు తరలివచ్చేందుకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివ రించారు. మాజీ సర్పంచ్ కోట రాంరెడ్డి, నాయకులు క్యాదాసి చంద్రమౌళి, శంకరయ్యగౌడ్, కొమురయ్యగౌడ్, జొంగోని సదయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్ర సందర్శన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేట హైదరాబాద్‌కు చెందిన భారత వరిపరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం మంగళవారం క్షేత్ర సందర్శన చేశారు. భూమి నమూనాలు పరిశీలించి రైతులకు వరిసాగులో మెలకువలు తెలిపారు. గ్రామా నికి చెందిన కొప్పుల సత్యనారాయణ అనే యువరైతు హైబ్రిడ్ వరివంగడాల తయారీని పరిశీలించారు. శాస్త్రవేత్తలు షేక్ఎన్‌వీ ఎరా, మదన్‌మోహన్‌రెడ్డి, మీరాకుమార్, రైతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మారం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

ధర్మారం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ సౌజన్య తెలిపారు. పాఠశా లకు చెందిన అంజలి లాంగ్‌జంప్‌లో, ఎండీ సల్మా 600 మీటర్ల పరుగుపందెంలో జిల్లాస్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 8,9 తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడి యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఇన్‌చార్జి ఎంఈవో ఛాయాదేవి, ఉపా ధ్యాయ బృందం అభినందించారు.

అయ్యప్ప మెట్ల పూజ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట మంగళవారం అయ్యప్ప మెట్ల పూజ నిర్వ హించారు. హనుమాన్ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పూజా మహోత్సవానికి ఎంపీపీ సునిత, అధిక సంఖ్యలో అయ్యప్ప మాల ధారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?




యార్లగడ్డ వనరాజు
స్కూల్ అసిస్టెంట్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సరూప త్రిభుజాలు

సమస్యలు-సమాధానాలు

1. 4 మీటర్లు, 6 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు 25 మీటర్ల దూరంలో నిటారుగా ఉన్నాయి. మొదటి స్తంభం కొనను రెండో స్తంభం పాదంతో, రెండో స్తంభం కొనను మొదటి స్తంభం పాదంతో కలిపే రేఖల ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?



జ. రెండు స్తంభాల ఎత్తులు AB = 4 మీ, CD = 6 మీ. అనుకోండి. భూమి నుంచి ఖండన బిందువు ఎత్తు PQ= z మీ. అనుకుంటే

ΔPQB, ΔCDBల్లో $\angle B = \angle B$ (ఉమ్మడి కోణం)

$\angle BQP = \angle BDC = 90^\circ$

కో.కో. నియమం ప్రకారం

$\Delta PQB \sim \Delta CDB$ అవుతుంది.

అప్పుడు

$\frac{BQ}{BD} = \frac{PQ}{CD} = \frac{z}{6}$ —— (1) ఇదేవిధంగా

$\Delta PQD \sim \Delta ABD$

అని చూపొచ్చు. అప్పుడు

$\frac{QD}{BD} = \frac{PQ}{AB} = \frac{z}{4}$ —— (2)


1, 2 లను కలిపితే $\frac{BQ}{BD} + \frac{QD}{BD} = \frac{z}{6} + \frac{z}{4}$

$\Rightarrow \frac{BQ+QD}{BD} = z\left(\frac{1}{6}+\frac{1}{4}\right)$

$\Rightarrow \frac{BD}{BD} = z\left(\frac{2+3}{12}\right) \Rightarrow 1 = z\left(\frac{5}{12}\right)$

$\Rightarrow z = \frac{12}{5} \times 1 = 2.4$ మీ.


■ **గమనిక:** ఈ సమస్యను పోలి ఉన్న సమస్య.. AB, CD, PQలు BDకి గీసిన లంబాలు AB=x, CD= y, PQ=z అయితే $\frac{1}{x} + \frac{1}{y} = \frac{1}{z}$ అని చూపండి అనే సమస్యతో పోలి ఉంటుంది.




2. ΔABCలో DE||BC, $\frac{AD}{DB} = \frac{3}{4}$, AC=15 సెం.మీ., అయితే AE విలువ ఎంత?

3. ΔABCలో DE||BC, AD= $4x-3$, AE=$8x-7$, BD= $3x-1$, CE= $5x-3$ అయితే x విలువ కనుగొనండి.

4. కింది పటంలో AB||CD||EF, AB = 7.5 సెం.మీ. DC = y సెం.మీ., EF = 4.5 సెం.మీ., BC = x సెం.మీ. అయితే x, y విలువలు కనుగొనండి.



5. కింది పటంలో A, B, Cలు వరుసగా OP, OQ, ORలపై బిందువులు. AB||PQ, AC||PR అయితే BC||QR అని చూపండి.



పైథాగరస్ సిద్ధాంతం (బౌధాయన సిద్ధాంతం)


'లంబకోణ త్రిభుజంలో కర్ణం మీది వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానం.'

విపర్యయంగా 'ఒక త్రిభుజంలో ఒక భుజం మీది వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానమైతే అది లంబకోణ త్రిభుజం.'

లంబకోణ త్రిభుజం ΔABCలో

$\angle B = 90^0$ అయితే..


$(AC)^2 = (AB)^2+(BC)^2$



మాదిరి ప్రశ్నలు

1. 5 మీటర్లు, 12 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు నిటారుగా ఒక చదునైన నేలపై ఉన్నాయి. భూమిపై ఆ రెండు స్తంభాల అడుగు భాగాల మధ్య దూరం 12 మీటర్లు అయితే ఆ రెండు స్తంభాల పై భాగాల మధ్య దూరం ఎంత?


జ.



AB, CD రెండు స్తంభాలు అనుకుంటే..
దత్తాంశం ప్రకారం AB = 5 మీ., CD = 12 మీ.
నేలపై స్తంభాల మధ్య దూరం CD = 24 మీ.
పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం
AC = x మీ. అనుకుంటే..
పటం నుంచి AE = 24 మీ.,
CE = CD–DE =12 – 5 = 7 మీ.
లంబకోణ త్రిభుజం ΔAECలో పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం
$x^2 = 24^2 + 7^2 \Rightarrow x^2 = 24^2 + 7^2$
$\Rightarrow x^2 = 625 \Rightarrow x = 25$

$\therefore$ పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం = 25 మీ.


2. లంబకోణ త్రిభుజం ABCలో లంబకోణ శీర్షం C వద్ద ఉంది. P, Qలు వరుసగా AC, BCలపై ఉన్నాయనుకోండి. అయితే $AQ^2+BP^2= AB^2+PQ^2$ అని చూపండి.





జ. లంబకోణ త్రిభుజాలు ΔACQ, ΔPCB ల నుంచి
$(AQ)^2=(AC)^2 + (QC)^2$,
$(BP)^2 = (BC)^2 + (CP)^2$
$\Rightarrow (AQ)^2 + (BP)^2 = [(AC)^2+(QC)^2] + [(BC)^2+ (CP)^2] =$
$[(AC)^2+(BC)^2] + [(QC)^2+(CP)^2]$
$= AB^2 + PQ^2$
($\because$ లంబకోణ త్రిభుజం ABC, PQC ల నుంచి $AB^2= AC^2+BC^2$, $PQ^2= PC^2+ QC^2$)

3.




పై రాంబస్‌లోని రెండు కర్ణాలు వరుసగా 24 సెం.మీ., 10 సెం.మీ. అయితే దాని భుజం పొడవు కనుక్కోండి.

జ. రాంబస్‌లో కర్ణాల వర్గాల మొత్తం.. భుజాల వర్గాల మొత్తానికి సమానం. అంటే..
$(AC)^2+(BD)^2 =$
$(AB)^2+(BC)^2+ (CD)^2 +(DA)^2$
రాంబస్‌లో AB= BC= CD=DA కాబట్టి
$(AC)^2+(BD)^2=$
$(AB)^2+(AB)^2+(AB)^2+(AB)^2 = 4AB^2$
$\Rightarrow (24)^2+(10)^2= 4(AB)^2$
$\Rightarrow 576+100 = 4(AB)^2$
$\Rightarrow 676 = 4(AB)^2 \Rightarrow 169 = (AB)^2$
$\therefore AB = 13$ సెం.మీ.

4. 5 సెం.మీ., 12 సెం.మీ., 13 సెం.మీ. భుజాల పొడవులుగా ఉన్న త్రిభుజం ABCలో 13 సెం.మీ. పొడవు ఉన్న భుజానికి దాని ఎదుటి శీర్షం నుంచి గీచిన లంబం పొడవు కనుక్కోండి.

జ. 5, 12, 13 సెం.మీ. భుజాల పొడవులుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుంది. ($\because 13^2 = 5^2 +12^2$)



AB =13 సెం.మీ., BC = 5 సెం.మీ.,
AC=12 సెం.మీ. అయినట్లు ABC ఒక లంబకోణ త్రిభుజం అనుకోండి.
13 సెం.మీ. పొడవున్న భుజానికి



గీసిన లంబం CD = p సెం.మీ. అనుకోండి.

ΔABC వైశాల్యం$= \frac{1}{2}$ భూమి × ఎత్తు

$= \frac{1}{2} \times BC \times AC = \frac{1}{2} \times 5 \times 12 = 30cm^2$


ΔABC వైశాల్యం$= \frac{1}{2}$ భూమి×ఎత్తు

$= \frac{1}{2} \times AB \times CD = \frac{1}{2} \times 13 \times p$

$\Rightarrow \frac{1}{2} \times 13 \times p = 30 \quad \Rightarrow p = \frac{60}{13}$


= 4.6 సెం.మీ. (సుమారుగా)

5. కింది పటం నుంచి
i) pc= ab,
ii) $\frac{1}{p^2} = \frac{1}{a^2} + \frac{1}{b^2}$ అని చూపండి.



6. ఒక సమబాహు త్రిభుజంలో భుజాల వర్గాల మొత్తానికి 3 రెట్లు, ఆ త్రిభుజం మధ్య గతాల వర్గాల మొత్తానికి 4 రెట్లకు సమానమని చూపండి.

7. లంబకోణ త్రిభుజం ΔABCలో $\angle B = 90^\circ$ AD, CEలు మధ్యగత రేఖలు AC= 5 సెం.మీ., $AD = \frac{3\sqrt{5}}{2}$ అయితే CE విలువ కనుక్కోండి.



8. (a–1) సెం.మీ. $2\sqrt{a}$ సెం.మీ. (a+1) సెం.మీ. భుజాలుగా ఉన్న త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా?

9. 5 మీ, 12 మీ, 13 మీ. భుజాలుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా? కారణాలు చెప్పండి.

Affixation is the process of adding..



R. Srinivasa Rao
Senior Faculty, Hyderabad



టీఎస్‌పీఎస్సీ
టీఆర్‌టీ
ఎస్‌జీటీ/ఎస్ఏ - ఇంగ్లిష్
ప్రత్యేకం

AFFIXATION

An affix is used to alter the meaning or form of a word. It can be either a Prefix or a Suffix.


Definition: Affixation is the process of adding a morpheme - or affix - to a word to create either a different form of that word or a new word with a different meaning.

The two primary kinds of 'Affixation' are prefixation, the addition of a prefix, and suffixation, the addition of a suffix, while clusters of affixes can be used to form complex words.

Prefixes: A prefix is a letter or group of letters attached to the beginning of a word that partly indicates its meaning.

Prefix	*Meaning*	*Examples*
A	Not	Amoral, Apolitical, Atypical
Anti	Against, Opposite of	Antiseptic, Anti-American, Antinuclear, Anti climax, Antiaircraft, Antibody
Bi	Two	Bicycle, Bisect, Bilingual
Co	With, Together	Copilot, Co-worker, Coexist, Co-author
De	Down, Off	Devalue, Deactivate, Degrade, Delink
Dis	Opposite of	Ddisappear, Disagreeable, Disbar, Disagree, Dislike, Disobey
En	Put into, Cover with	Enclose, Entangle, Enslave, Encase
Ex	Former	Ex-president, Ex-serviceman
Hyper	Over, More, Beyond	Hyperactive, Hypersensitive, Hypercritical
Il, Im, In, Ir	Not, Without	Illegal, Illogical, Immoral, Immeasurable, Inconsiderate, Incurable, Irresponsible
Omni	All, Every	Omnivorous, Omniscient, Omnipotent, Omnipresent
Post	After	Postmortem, Posterior, Postscript
Tri	Three	Tricycle, Triangle, Triathlon
Over	Too much, Across	Over-confident, Over-populated
Un	Opposite	Unhappy, Unfair, Untrue
Vice	Next in rank	Vice-president, Vice-principal, Vice-chancellor, Vice-admiral

Note: The difference between prefixes and suffixes is that while prefixes do not change word class (noun to verb or adjective to noun) etc. suffixes mostly change the word class.



Previous and Model Questions

1. Identify the correct suffix for the words given below: *(AP TET - 2015)*

Word	*Suffix*
(a) Doubt	(i) ness
(b) High	(ii) ful
	(iii) ment

1) (a)-(ii), (b)-(iii)
2) (a)-(iii), (b)-(ii)
3) (a)-(ii), (b)-(i)
4) (a)-(iii), (b)-(iii)

A: (3) Doubtful, Highness.

EXERCISE - I

1. Identify the correct suffixes for the words given below:

Word	*Suffix*
(a) Remark	(i) ise
(b) Discover	(ii) let
(c) Book	(iii) ify
(d) Popular	(iv) able
(e) Pure	(v) y

1) (a) - (ii), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (v)
2) (a) - (iv), (b) - (i), (c) - (ii), (d) - (iii), (e) - (v)
3) (a) - (iv), (b) - (v), (c) - (ii), (d) - (i), (e) - (iii)
4) (a) - (iv), (b) - (i), (c) - (v), (d) - (iii), (e) - (ii)

A: (3)

EXERCISE - II

1. Identify the correct suffixes for the words given below.

Word	*Suffix*
(a) Virtue	(i) ize
(b) Love	(ii) ive
(c) Terror	(iii) able
(d) Abuse	(iv) ful
(e) Thank	(v) ous

1) (a) - (v), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (ii)
2) (a) - (v), (b) - (iii), (c) - (i), (d) - (ii), (e) - (iv)
3) (a) - (iii), (b) - (iv), (c) - (i), (d) - (ii), (e) - (v)
4) (a) - (iii), (b) - (v), (c) - (i), (d) - (iv), (e) - (ii)

A: (2)

Suffixes: A suffix is a letter or group of letters added at the end of a word to make a new word.

1. The following adjectives get converted into nouns by adding certain suffixes which change the word class of the basic word.

Adjective	*Suffix*	*Noun*
Free	-dom	Freedom
Wise	-dom	Wisdom
Important	-ance	Importance
Permanent	-ence	Permanence
False	-hood	Falsehood
Active, Civil, Human, Real	-ity	Activity, Civility, Humanity, Reality
Dark, Happy, Mad	-ness	Darkness, Happiness, Madness
Hard	-ship	Hardship
Long, Strong	-th	Length, Strength

2. Here are some examples of a verb getting converted into a noun.

Verb	*Suffix*	*- Noun*
Leak	-age	Leakage
Shrink	-age	Shrinkage
Waste	-age	Wastage
Arrive, Refuse	-al	Arrival, Refusal
Accept, Appear	-ance	Acceptance, Appearance
Assist, Inhabit	-ant	Assistant, Inhabitant
Build, Meet, Teach	-ing	Building, Meeting, Teaching

3. Here are a few examples of a noun forming a new word which is also a noun.

Noun	*Suffix*	*Noun*
King	-dom	Kingdom
History	-ian	Historian
Hero	-ism	Heroism
Drama, Motor	-ist	Dramatist, Motorist

4.

Adjective	*Suffix*	*Verb*
Cheap, Deep, Sharp	-en	Cheapen, Deepen, Sharpen
Just, Pure	-ify	Justify, Purify

5.

Noun	*Suffix*	*Verb*
Length	-en	Lengthen
Strength	-en	Strengthen
Class	-ify	Classify
Apology	-ise	Apologise

6.

Noun	*Suffix*	*Adjective*
Comfort	-able	Comfortable
Culture	-al	Cultural
Element	-ary	Elementary
Point	-end	Pointed
Gold	-en	Golden
Beauty	-ful	Beautiful
Help	-ful	Helpful
Sense	-ible	Sensible

7.

Verb	*Suffix*	*Adjective*
Read	-able	Readable
Resist	-ant	Resistant
Digest	-ible	Digestible
Prohibit	-ive	Prohibitive

8.

Adjective	*Suffix*	*Adverb*
Happy	-ly	Happily
Foolish	-ly	Foolishly
Melodious	-ly	Melodiously
Great	-ly	Greatly
Artistic	-ly	Artistically

డిసెంబర్‌లో 91 శాతం ఉత్పత్తి

- సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో 61, ఓపెన్ కాస్ట్‌ల్లో 97 శాతం బొగ్గు వెలికితీత
- 4 ఏరియాల్లోనే 100 శాతం, 7 ఏరియాలు వెనుకంజ

సింగరేణి వ్యాప్తంగా ఉన్న 30 భూగర్భ గనులు, 16 ఓపెన్ కాస్ట్‌ల్లో డిసెంబర్ మాసంలో 62.49,400 టన్నుల లక్ష్యానికి గాను 56,75,142 టన్నులు, అనగా 30 భూగర్భ గనుల్లో 6,93,171 టన్నులు, 16 ఓపెన్ కాస్ట్ గనుల్లో 49,81,971 టన్నులు అనగా 97 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది.

డిసెంబర్ మాసంలో ఏరియా వారీగా ఉత్పత్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి

ఏరియా	టార్గెట్	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	8,60,600	8,98.751	117
ఇల్లెందు	4,75,000	3,33.437	113
మణుగూరు	5,34,000	4,98,534	113
రామగుండం-1	5,55,700	4,37,902	100
రామగుండం-2	6,85,800	3.53.651	85
రామగుండం-3	6,10.000	6,13,440	95
భూపాలపల్లి	4,59,300	3,30,615	64
ఆడ్రియాల	2,76,500	51,861	18
బెల్లంపల్లి	6,50,000	5,62,835	90
మందమర్రి	4,84,000	1,63,577	66
శ్రీరాంపూర్	5,10,800	2,49,768	83
యూజీల టార్గెట్	11.31,300	6,93,171	61
ఓపెన్‌కాస్ట్‌ల టార్గెట్	51,18,,100	49,81,971	97
ఓసీ,యూజీలు			
కలిపి,మొత్తం	62,49,400	56,75,142	91


ఓపెన్ కాస్ట్‌లలో ఉత్పత్తి జరుగుతున్న దృశ్యం

9 మాసాల్లో వివిధ ఏరియాలు సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలు

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	68,36,000	66,74,538	98
ఇల్లెందు	40,7,000	28,32,043	70
మణుగూరు	47,25,600	48,80,809	103
రామగుండం-1	45,66,100	43,44,776	95
రామగుండం-2	53,78,000	44,72,371	83
రామగుండం-3	45,70,000	54,91,281	120
భూపాలపల్లి	27.05,700	23,98,928	89
అండ్రియాల	24,65,500	4,77,822	19
బెల్లంపల్లి	50,10,000	53,32,307	104
మందమర్రి	33,75,200	18,14,564	54
శ్రీరాంపూర్	39,85,000	33,71,995	85
మొత్తం యూజీలలో	97.44,500	61,56,055	63
మొత్తం ఓసీలలో	3,79,42,600	3,58,35,379	94
గ్రాండ్ టోటల్	4,76,87,100	4,19,91,434	88

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ ప్రతి నెలా మొదటివారంలో హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో జీఎంలతో సమీక్షా సమావేశం ఏర్పాలు చేసి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని చెబుతున్నా ఫలితం ఉండడంలేదు. ప్రతి ఏరియా రోజువారీ లక్ష్యాసాధనకు కృషిచేయాలని, ముఖ్యంగా భూగర్భగనులలో 100 శాతం ఉత్పత్తి లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాలని రివ్యూమీటింగ్‌లో 11 ఏరియాల జీఎంలకు ఆదేశాలు జారీచేసినా అధికారుల తీరుమారలేదు. రోజువారీ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో గతంలో భూగర్భగనులు మాత్రమే వెనకబడి ఉండేవని, కానీ ఇటీవల కాలంలో ఓపెన్‌కాస్ట్ గనులు కూడా ఉత్పత్తి 100 శాతం సాధించక వెనుకబడి ఉన్నాయని ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, తొమ్మిది మాసాలలో 47,68 మిలియన్ టన్నుల లక్ష్యానికి 41.99 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అనగా 88 ఉత్పత్తిని మాత్రమే సాధించిందని సింగరేణి గణాంకాల ద్వారా తెలిసింది. గత ఎడాది ఇదే మాసంలో 42,41, అదేవిధంగా 2015-16లో 43.24 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించిన సంస్థ ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో సుమారు 6 మిలియన్ టన్నుల వెనుకంజలో ఉన్నట్లు సింగరేణి గణాంకాలు చెబుతున్నాయి. సంస్థ చైర్మన్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు నెలవారీ లక్ష్యాల సాధనకు ఎన్ని ప్రణాళికలు వేసినా ఏరియాలలో ఉన్నతాధికారులు వాటిని అమలు చేయటంలో విఫలమవుతున్నారని, ఫలితంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కేవలం నాలుగు ఏరియాలు (కొత్తగూడెం ఏరియా 8,70,610 లక్షల టన్నుల లక్ష్యానికి 10.18,992 టన్నులు అనగా 117%, మణుగూరు ఏరియా 113%, ఇల్లెందు 113%, ఆర్జీ-1 ఏరియా 100% ఉత్పత్తిని సాధించగా, మిగిలిన 7 ఏరియాలైన ఆర్జీ-2-85%, ఆర్జీ-3 95%, భూపాలపల్లి 64%, ఆండ్రియాలప్రాజెక్ట్-18%, బెల్లంపెల్లి-90%, మందమర్రి-66%, శ్రీరాంపూర్ ఏరియా-83%, 7 ఏరియాల్లో ఉత్పత్తి వెనుకంజలో ఉన్నాయని కార్మికులు చర్చించుకుంటున్నారు.

రీజియన్‌లో ఉత్పత్తి మెరుగు..

గడచిన 9 మసాలలో కొత్తగూడెం రీజియన్‌లోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాలలో గత నెలకంటే బొగ్గు కొంత మెరుగ్గా ఉంది. డిసెంబర్ మాసంలో మూడు ఏరియాలలో కొత్తగూడెం ఏరియా 117%, మణుగూరు ఏరియా 113%, ఇల్లెందు ఏరియా 113% ఉత్పత్తి సాధించాయి. మిగిలిన రీజియన్‌లలో ఏ రీజియన్ 100% ఉత్పత్తిని సాధించకలేక పోయాయి. 11 ఏరియాలలో కలిపి డిసెంబర్ మాసానికి 47.68 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 41.99 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేసింది. అంతేకాకుండా రానున్న జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో 90 పని దినాల్లో సుమారు 25.01 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలి. ఈలెక్కన ఇప్పటికి రోజుకు 2 లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలని భావిస్తున్న యాజమాన్యం రోజుకు 2.50 లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తేనే లక్ష్యాసాధన సాధ్యమవుతుందని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు.

కొడుకును చంపిన తల్లి

అసభ్యకరంగా ప్రవర్తించినందుకే అఘాయిత్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మంథని: వేధింపులు తాళలేక ఓ తల్లి కన్నకొడుకునే కడతేర్చింది. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. గోదావరిఖని ఏఎస్పీ అపూర్వరావు, మంథని సీఐ నటేష్‌గౌడ్ కథనం... మంథనిలోని ఎరుకలగూడెంకు చెందిన ఈర్నాల రేణుక కొడుకు ఈర్నాల దినేష్ (26) ఐదు సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయాడు. దీంతో తల్లి ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించింది. కొద్దిగా నయం అయ్యాక ఇంటికి తీసుకురాగా ఇంట్లో, గ్రామంలోని పలువురిని కొట్టడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. తరచూ తల్లి రేణుకతో గొడవ పడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో దినేష్ తల్లిని కొట్టాడు. అంతేగాకుండా అత్యాచారానికి యత్నించాడు. కోపోద్రిక్తులైన తల్లి బయట ఉన్న రోకలి బండను తీసుకొచ్చి దినేష్ తలపై బాదింది. తీవ్రరక్తస్రావం కావడంతో దినేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఆర్‌సీహెచ్‌పీ ఉద్యోగులకు రూ.లక్ష నజరానా

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) కార్మికులకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ మంగళవారం రూ. లక్ష గిఫ్ట్‌గా అందజేసినట్లు ఏరియా డీవైజీఎం పర్సనల్ సాల్మన్ తెలిపారు. డిసెంబర్ నెలలో 238 రేకుల బొగ్గును రవాణా చేసినందుకు గాను ఈగిఫ్ట్‌ను అందజేసినట్లు తెలిపారు. సింగరేణి ఏర్పడిన నాటి నుంచి ఇంత బొగ్గును రవాణాచేయటం ఇదే ప్రప్రథమన్నా రు. ఇందుకు సహకరించిన అధికారులకు, సూపర్వైజర్లకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్సెంటివ్‌లు ప్రకటించినా ఊపందుకోని ఉత్పత్తి

వార్షిక లక్ష్యం 66.06 మిలియన్ టన్నులు


బొగ్గు వెలికితీస్తున్న దృశ్యం

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి జిల్లా): సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం గడువు మరో 90 రోజులే మిగిలింది. 2017-18 సంవత్సరంలో 66.06 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా ఇప్పటివరకు 41.99 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో 88 శాతం చేరుకుంది. 2016-17 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ చివరినాటికి 42.41మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పసాధించి ముందంజలో ఈసారి మాత్రం కొంత వెనకబడింది. సింగరేణి వ్యాప్తంగా 120 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ఆర్జీ-3 డివిజన్ నెంబర్‌వన్ స్థానంలో ఉండగా 104 శాతం బొగ్గు ఉత్పత్తితో బెల్లంపల్లి ఏరియా రెండో స్థానం, 103 శాతం సాధించి మణుగూరు మూడో స్థానంలో నిలిచాయి. 19 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి అడ్ర్యాల ప్రాజెక్టు ఏరియా చివరి స్థానంలో నిలిచింది. బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన కోసం ఇన్సెంటివ్‌లు ప్రకటించినా ఉత్పత్తి ఊపందుకోలేదు. దీంతో రాబోయే 90 రోజుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధించడానికి గడువు మాత్రమే ఉంది. వార్షిక అంచనాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం కష్టంగా ఉన్నట్లు భావిస్తున్నారు. కొన్ని ఏరియాలో లక్ష్యాల సాధనలో దూరంగా ఉండటంతో రాబోయే మూడు నెలల్లో వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధన ఏవిధంగా సాధిస్తారనేది వేచి చూడాల్సిందే.

ఉత్పత్తిపై ప్రభావం చూపనున్న మేడారం సమ్మక్క జాతర

ఈసారి మేడారం సమ్మక్క జాతర ఈనెలాఖరులో ఉండటంతో కార్మికుల గైర్హాజర్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీనికి ముందు వేములవాడ, కొండగట్టు, కొమురవెల్లి జాతరలకు కార్మిక కుటుంబాలు మొక్కులు చెల్లించేందుకు వెళ్లే అవకాశం ఉండటంతో కనీసం వారం రోజులు ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశాలున్నాయి. దీంతో ఈసారి లక్ష్య సాధన అనుకున్న మేరకు సాధించే అవకాశాలు కష్టమేనని అంటున్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేరుద్దాం..




హాజరైన జిల్లా అధికారులు, ఉద్యోగులు.. జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్

ప్రజలతో మర్యాదగా మెలగాలి

- కుటుంబీకులను నిర్లక్ష్యం చేయొద్దు
- యాసంగి పంటసాగుపై దృష్టి పెట్టండి
- జిల్లా అధికారులతో ఇన్‌చార్జి కలెక్టర్ పరిచయకార్యక్రమం

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా పనిచేస్తూ జిల్లా ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దాం. జిల్లాలో అనుభవం గల వారే జిల్లా అధికారులుగా ఉన్నారు. ఆయా శాఖల పనులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలపాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జిగా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన పరిచయ సమావేశంలో మాట్లాడారు. జిల్లాను ప్రగతిపథం వైపు తీసుకెళ్లేందుకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని అంకితభావంతో పనిచేయాలన్నారు. పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, చిరునవ్వుతో స్వాగతించాలన్నారు. అంకితభావంతో పనిచేసే అధికారులకు ప్రజల్లో, ఉన్నతాధికారుల్లో మంచి గుర్తింపు ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అధికారులు ఉద్యోగ బాధ్యతలకే పరిమితమై తమ కుటుంబీకులను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. జిల్లాలో యాసంగి పంటను సాగుచేసే రైతాంగానికి సరైన సూచనలిస్తూ పంటలు నష్టపోకుండా ఉండేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో నిబద్ధతగా వ్యవహరించాలని, అర్హులైన వారికే పథకాల ఫలాలు అందేలా చూడాలన్నారు. జిల్లా ప్రజలు, అధికారులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో పద్మయ్య, ఆర్డీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కేక్ కట్‌చేయించిన టీఎన్‌జీవోలు..

ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా జిల్లాకు వచ్చిన కర్ణన్‌ను టీఎన్‌జీవోల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలిపి కేక్‌కట్ చేయించారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమైందని, ఇందుకు టీఎన్‌జీవోల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి జిల్లా అభివృద్ధికి సహకరిస్తామని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి రవీందర్ చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన ఐడీసీ చైర్మన్ 'ఈద'

తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారిగా వచ్చిన కర్ణన్‌ను కలిసి జిల్లా గురించి పలు విషయాలు ప్రస్తావించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజయ్య, నాయకులు జావిద్, వెంకటాచారి తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికుల మెరుపు సమ్మె



ధర్నా చేస్తున్న కార్మికులు

పెద్దపల్లిటౌన్: నగరపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట మెరుపు సమ్మెకు దిగారు. ఈసందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ కోసం కార్మికుల వేతనాల నుంచి కోత విధిస్తున్నారని, వచ్చే కొద్దిపాటి వేతనంలో కటింగ్ చేయడంతో వారి కుటుంబాలు గడవడం కష్టమవుతుందన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనం పెంచి చెల్లించాలని కోరారు. శాశ్వత కార్మికులకు కూడా సరెండర్ సెలవులు, ఇంక్రిమెంట్లు సకాలంలో చెల్లించడం లేదని, ఎన్ఎంఆర్ కార్మికుల పర్మినెంట్ కోసం సిఫారసు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నిరసనలో నాయకులు మల్లారపు కొమురయ్య, వెంకటస్వామి, ఆరెపల్లి చంద్రయ్య, సలిగంటి పద్మ, ఈర్ల నర్సమ్మ, బొంకూరి చంద్రయ్య, ఎం. శ్రీనివాస్, లక్ష్మణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు గాంధేయవాది సుబ్బారావు రాక



పెద్దపల్లిఅర్బన్: స్వామి వివేకానంద 155వ జయంతిని పురస్కరించుకొని ప్రముక గాంధేయవాది, శాంతిదూత స్వాతంత్ర్య సమరయోధుడు సేలం నంజుందెయ్య సుబ్బారావు ఈనెల 4న పెద్దపల్లికి రానున్నారు.





రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్దకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న రహదారితో పర్యాటకులు ఇక్కట్లకు గురవుతున్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలంటే రవాదారి నిర్మాణం చేపట్టాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010201669

న్యూస్ బాక్స్

గ్రామాభివృద్ధిపై దృష్టిసారించండి

పాలకుర్తి: గ్రామాభివృద్ధిపై పాలకులు దృష్టిసారించాలని పాలకుర్తి గ్రామ ప్రజలు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మాడ రాజిరెడ్డి పంచాయతీ ఆదాయ వ్యయాల నివేదిక అందించారు. డ్రెయినేజీల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రోడ్ల విషయంలో పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని గ్రామస్తులు అన్నారు. పంచాయతీకి చెల్లించే ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈసందర్భంగా వివిధ పనులు కోసం పలు తీర్మానాలు చేశారు. సర్పంచ్ శ్రీనివాస్, ఎంపిటీసీ రాజమౌళి పాల్గొన్నారు.

మంద కృష్ణను విడుదల చేసే వరకు ఉద్యమిస్తాం

గోదావరిఖనిటౌన్: మంద కృష్ణ మాదిగపై కేసు ఎత్తివేసి విడుదల చేసే వరకు ఉద్యమాలు సాగిస్తామని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి ఓదెలు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మార్కండేయకాలనీలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమంలో పోలీసుల ప్రమేయంతోనే భారతి మృతి చెందిందని ఆరోపించారు. నిరంతర ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, ఉదయ్, భాస్కర్, రంజీత్ పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

జ్యోతినగర్: శబరిమలకు అయ్యప్ప స్వాములు బయల్దేరారు. మంగళవారం రామగుండం ఎరువుల కర్మాగారం టౌన్‌షిప్‌లోని అయ్యప్ప ఆలయంలో మాలధారణ కార్యక్రమంలో గురుస్వామి లక్ష్మీనారాయణ స్వాములుకు ఇరుముడి కట్టి ప్రత్యేక పూజలు చేశారు.

ముర్మూర్‌లో పశువైద్య శిబిరం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామంలో మంగళవారం ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 79 మంది రైతులకు చెందిన 2,675 పశువులకు వైద్య సేవలు అందించి మందులు అందజేశారు. సర్పంచ్ సుధాకర్, వైస్‌ఎంపీపీ కొదురుపాక పవన్, వెటర్నరీ డాక్టర్ శ్రవణ్‌కుమార్, సీఎస్‌ఆర్ ప్రతినిధులు జీవన్‌రాజ్, విఠల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధార్ ఉంటేనే..

రోగులకు మందులు..!

రామగుండం: వైద్య సేవలు పొందేందుకు కూడా ఆధార్ కార్డు అవసరం వచ్చిన రోజూ రానే వచ్చింది. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించి సంబంధిత రోగి ఆధార్‌కార్డు ఉంటేనే ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రతీరోజు పీహెచ్‌సీకి వచ్చిన రోగుల సంఖ్య, జబ్బుల వివరాలు, చిరునామా, గతంలో వాడిన మందులు ఉంటే ఏమైనా, ఆధార్‌కార్డు నెంబర్ తదితర వివరాలను నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీలను మరింత ఆధునిక పరిజ్ఞానంతో కూడిన వసతులను కల్పిస్తూ నాణ్యమైన మందులను అందజేయాలని నిర్ణయించింది.

- పీహెచ్‌సీలో అమలవుతున్న నిబంధన
- ఆన్‌లైన్‌లో మందుల పంపిణీ వివరాలు



రామగుండం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పక్కదారి పట్టకుండా..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖరీదైన మందులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఆధార్ ఆధారంగా మందుల అందజేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీలో మందుల నిల్వలు జిల్లా పంపిణీ విభాగంలో ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. పీహెచ్‌సీకి కేటాయించే ముందు ఆన్‌లైన్‌లో మందుల రకాలు, సప్లయ్ చేస్తున్న కోటా వివరాలను పొందుపరుస్తున్నారు. అందులో భాగంగానే తాము రోగులకు మందులను అందజేసే వాటి వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తూ సదరు రోగి ఆధార్ కార్డుకు అనుసంధానం చేస్తున్నారు.

పారదర్శకం కోసమే..

ఆధార్ కార్డు ఆధారంగా రోగులకు పీహెచ్‌సీలో మందులు పంపిణీ చేయడంతో క్రమంగా మందుల నిల్వలు సులభంగా గుర్తించే వీలుంటుంది. ఆన్‌లైన్‌లో చూస్తే వివిధ రకాల మందుల నిల్వలు స్పష్టంగా తెలుస్తాయి. తద్వారా రోగులకు పంపిణీ చేసేందుకు సులభంగా ఉండడమే కాకుండా ప్రభుత్వం పీహెచ్‌సీకి మందుల పంపిణీ చేసేందుకు ఇండెంట్‌ను చూసే పని లేకుండా ఆన్‌లైన్‌లో పరిశీలించి మందులను పంపిణీ చేయవచ్చు. దీంతో పీహెచ్‌సీలలో ఫార్మాసిస్టులకు పనిభారం తగ్గడమే కాకుండా ఎప్పటికప్పుడు స్టాక్ నిల్వలు తెలుసుకునే వీలుంటుంది.

రోగి వివరాలు నిక్షిప్తం

రోగులకు మందులను పంపిణీ చేసిన విషయాన్ని కూడా ఆధార్‌కార్డు నెంబర్ ఆధారంగా ఉన్నతాధికారులు సదరు రోగికి ఫోన్ చేసి వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధానంతో అధికారులకు రోగులకు మధ్య జవాబుదారీతనం పెరుగుతుండడంతో పాటు రోగి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటుండడంతో రోగి ఏ కారణం చేతనైనా అస్వస్థతకు గురైతే అసలైన కారణాలను తెలుసుకోవచ్చు. కాగా రోగి ప్రాణాపాయస్థితిలోకి వెళితే సదరు వైద్యులు ఇచ్చిన మందులు వికటించడంతోనే ఈ పరిస్థితి వచ్చిందనే విషయాలపై అవగాహన రాహిత్యంతో అనవసరంగా వైద్య సిబ్బందిపై ఆరోపణలు చేసే అవకాశం ఉండదు. ఈ నివేదికల ఆధారంగా రోగి పరిస్థితిని డాక్టర్లు సులభంగా గుర్తించి త్వరితగతిన చికిత్స అందించే అవకాశం ఉంటుంది.

ఈ విధానం నచ్చింది



పీహెచ్‌సీలలో రోగి జబ్బు వివరాలు నమోదు చేసుకొని ఆధార్‌కార్డు ఆధారంగా మందుల పంపిణీ చేయడం జవాబుదారీతనంగా ఉంటుంది. మరింత మెరుగైన చికిత్సలు పీహెచ్‌సీలలో ప్రారంభిస్తే రోగులకు నమ్మకం కుదురుతుంది.

- పాక కోటేశ్వర్, రోగి బంధువు

పారదర్శకత కోసమే..



రోగి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం కోసమే ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరుతున్నాం. ఫలితంగా రోగికి అందజేసే మందుల వివరాలతో పాటు రోగి ఆరోగ్య స్థితిపై తమకు పూర్తి అవగాహన వస్తుంది. పీహెచ్‌సీలో మందుల నిల్వలపై స్పష్టత ఉంటుంది.

- డాక్టర్ శిల్పిణీ, పీహెచ్‌సీ, రామగుండం

మహిళలు కుటీర పరిశ్రమలు స్థాపించాలి

రామగుండం: ప్రతీ మహిళ కుటీర పరిశ్రమల స్థాపనకు పాటుపడితే రాష్ట్రం ఆర్థిక ఎదుగుదల దిశగా పయనిస్తుందని పెద్దపల్లి జిల్లా అభివృద్ధి ఫోరం ప్రతినిధి పెద్దంపేట శంకర్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామంలో మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం మాట్లాడుతూ మహిళలు ఇంట్లో చేసే ప్రతీ వంటకాన్ని పరిశ్రమగా మార్చవచ్చన్నారు. ప్రతీ ఏటా మామిడికాయ పచ్చడి చేయడం మహిళలకు సహజమే.. దానినే కుటీర పరిశ్రమగా ఎంపిక చేసుకొని మంచి రుచికరమైన పచ్చళ్ళను మార్కెట్లోకి పంపిస్తే ఆదాయం గడించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల సరస్వతి, ఎన్టీపీసీ డాక్టర్ సస్మితడ్యాస్, సీపీ ఎనగంటి అనురాధ, బొడ్డు సత్యవాణి, మేకల మైసయ్య పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న శంకర్

లోకల్ వాయిస్

ఫ్లై ఓవర్ త్వరగా నిర్మించాలి



రామగుండం: రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు వచ్చేందుకు గంటల తరబడి రైల్వే గేటు వేయడంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేస్తే ఇబ్బంది ఉండదు.

- బదావత్ సారయ్యనాయక్

వెండితెర



టైగర్ జిందా హై (హిందీ)
శ్రీనివాస(ఫోన్–241688)
11:30, 2:30, 6:30, 9:30.

ఎంసీఏ
న్యూఅశోక(ఫోన్–244885)
11:30, 2:30, 6:00, 9:00.

హలో
ఊర్వశి(ఫోన్–244885)
11:30, 2:30, 6:00, 9:00.

అంజన్న సేవలో..



జ్యోతినగర్: గౌతమినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు రాంపెల్లి మురళీధర్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీ దుగ్గల్‌ను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ ప్రతినిధులు మంగళవారం సీపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక లక్ష్మీనగర్‌లో వన్‌వే రూట్‌తో వ్యాపారాలు నడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అనంతరం ఏసీపీ అపూర్వరావు, ట్రాఫిక్ ఏసీపీ వెంకటరమణ, నగర మేయర్ కొంకటి లక్ష్మీనారాయణలకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు జి.రవీంద్రాచారి, బి.రామస్వామి, రాజేష్‌కుమార్‌శర్మ, జి.రాజు, డి.తిరుపతిగౌడ్, పవన్ లాహోటీ, అనిల్‌రెడ్డి, ఆనంద్, తుల సీరామ్, మూల్‌చంద్, శంకర్, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు 'ఖని' విద్యార్థి



వినయ్‌కి అభినందన

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని రేయిన్‌బో పాఠశాల విద్యార్థి ఇ.వినయ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 1 నుంచి 3 వరకు కరీంనగర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 400 మీటర్ల పోటీలలో జూనియర్ విభాగం నుంచి మూడో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. అమరేందర్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

యైటింక్లయిన్‌కాలనీ: వందశాతం ఉత్తీర్ణత దిశగా విద్యార్థులు, ఉపాధ్యాయలు ముందుకు సాగాలని పాఠశాల కరస్పాండెంట్ ఎన్‌వీ రావు కోరారు. స్థానిక సింగరేణి పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమన్వయంతో ముందుకు సాగి బాధ్యతతో లక్ష్యాలను సాధించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం డీవీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు యువసేన జిల్లా అధ్యక్షుడిగా నరేశ్

గోదావరిఖని: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు యువసేన జిల్లా అధ్యక్షుడిగా గాదె నరేశ్‌ను నియమిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పూసాల సాయిరాం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ భూములపై స్పష్టత ఇవ్వాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామంలోని శివాలయానికి చెందిన భూములపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి గ్రామస్తులు శివాలయ ప్రాంగణంలోనే రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ భూములు అన్యాక్రాంతామవుతున్నాయంటూ కొన్ని నెలలుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని ఆరోపించారు. కాగా దేవాదాయ శాఖాధికారులకు సమాచారమిస్తే రెవెన్యూ అధికారులు గుర్తించి తమకు అప్పగించాల్సి ఉంటుందని తెలిపారన్నారు. భూప్రక్షాళనలో సైతం అధికారులు సదరు భూములపై తేల్చలేదన్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ గ్రామస్తులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆలయ భూములను గుర్తించేంత వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షలలో గ్రామస్తులు మచ్చ రాయమల్లమ్మ, లస్మమ్మ, గుమ్ముల నర్సమ్మ, రాజలింగు, ధర్మాజి రాజయ్య, కొయిలాల రాజయ్య, భాగ్యలక్ష్మి, హన్మంతు, మేడి వసంత, తోకల లక్ష్మి పాల్గొన్నారు.



దీక్షలు చేస్తున్న గ్రామస్తులు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గోదావరిఖని: రైతులకు నిరంతర 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయడంపై మంగళవారం జనగామ గ్రామంలో కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జాగృతి యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తోకల రమేశ్ నాయకులు బొగ్గుల సాయి, చిట్టవేన వేణు, వేయిగంట్ల శ్రీను, సకినాల ప్రతాప్, మేడం సతీష్, జనగాం సంపత్, కొండల్ శ్రీకాంత్, శ్రీవాస్తవ్, జువ్వాడి రామారావు, చక్రపాణి, మద్దెల శరత్, నీలం చంద్రయ్య, కేశవ్‌గౌడ్, సంపత్, రమేశ్, వెంకటేశ్, లక్ష్మయ్య, రాజు, గట్టయ్య పాల్గొన్నారు.

రామగుండం: పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. టీఆర్‌వీకేఎస్ నాయకులు కృష్ణమూర్తి, జహంగీర్ అహ్మద్, కిరణ్, అమ్మిరెడ్డి, మల్లారెడ్డి, ఇస్మాయిల్, చందు, రహీం, శ్రీనివాస్, శ్రీకాంత్, 1535 ప్రతినిధులు జితేందర్ సింగ్‌ఠాకూర్, 327, 1104, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సంఘాల ప్రతినిధులు నర్సింగరావు, మల్లేష్, ఎండీ.సలీం, ఇమామ్ షరీఫ్, టీఆర్‌ఎస్ యూత్ నాయకుడు అన్వేశ్ పాల్గొన్నారు.



రామగుండం: క్షీరాభిషేకం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కొమురం భీమ్ నగర్ ఏర్పాటు

గోదావరిఖని: స్థానిక గంగానగర్ సమీపంలో కొమురం భీమ్ నగర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు ఎ.మహేశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పక్కా ఇళ్లు నిర్మించాలని, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. డివిజన్ అధ్యక్షురాలు ఇ.లావణ్య, లలిత, రమణ, జి.వెంకన్న, ఎన్.శంకర్, సీతారాం, శంకరమ్మ, స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప శోభాయాత్ర

రామగుండం: పట్టణంలో అయ్యప్ప రథయాత్ర సోమవారం రాత్రి శోభాయమానంగా నిర్వహించారు. వందలాది మంది చిన్నారులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కోలాట బృందాల మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.

ఇంటర్వ్యూ



అంజయ్య
అంశం : ప్రత్యేక తరగతులు
ప్రిన్సిపాల్, గోదావరిఖని

ప్రశ్న: ప్రభుత్వ బాలికల కళాశాలలో అధిక ఉత్తీర్ణతకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: ఈ విద్యా సంవత్సరంలోనూ అధిక ఉత్తీర్ణత వచ్చేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. అధ్యాపకుల సహకారంతో అధిక ఉత్తీర్ణత తప్పకుండా సాధిస్తాం.

ప్రశ్న: ప్రత్యేక కార్యక్రమాలు ఏం చేస్తున్నారు ?
జవాబు: ప్రతిరోజు అదనంగా రెండు గంటలు సమయాన్ని కేటాయించి. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అధిక ఉత్తీర్ణత సాధించి తీరుతాం. విద్యార్థులకు ఉత్తీర్ణత కోసం అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులకు అధిక సమయం కోసం పౌష్టిక ఆహారం అందిస్తున్నాం.

ప్రశ్న: ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారా?
జవాబు: ప్రతి సంవత్సరం జనవరి నుంచి మార్చి వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అలాగే వారం, నెల, ఇతర ప్రత్యేక పరీక్షలను నిర్వహించి అధిక ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ఈ సంవత్సరం కూడా రికార్డు సాధిస్తారా?
జవాబు: ఆరేళ్లుగా జిల్లా వ్యాప్తంగా అధిక ఉత్తీర్ణత సాధించి మొదటిస్థానంలో ఉంది. ఈ సంవత్సరం కూడా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం.

- గోదావరిఖనిటౌన్

అనాథ పిల్లలకు స్వెట్టర్లు పంపిణీ

కోల్‌సిటీ: ఆదరణ నిస్సహాయ పిల్లల ఆశ్రమంలోని చిన్నారులకు యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి మంద శ్రీనివాస్‌రెడ్డి, సరిత కుమారుడు రవిచందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్వెట్టర్లు, ఫ్రూట్స్, చాక్లెట్లు మంగళవారం పంపిణీ చేశారు. ప్రవీణ్, కిషోర్, సురేందర్, ఆశ్రమ నిర్వాహకులు లక్ష్మి, సీహెచ్ కృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వెట్టర్లు అందజేస్తున్న దంపతులు



కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామంలోని రక్షిత వాటర్ ట్యాంక్ కింద ఉన్న గేట్‌వాల్ గుంతలో మురుగునీటితోపాటు చెత్తచెదారం పేరుకుపోవడంతో తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారీన పడే ప్రమాదం పొంచి ఉంది.

ముత్తారం: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలలకు శుద్ధజలాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు పాలకుల నిర్లక్ష్యంతో అలంకారప్రాయంగా మారాయి. చెడిపోయిన ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు శుద్ధజలం అందకుండా పోతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో చేతిపంపు నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్లు వివిధ కారణాలతో అలంకారప్రాయంగా మారినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

లక్కారంలో మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్



అందని శుద్ధజలం

- అలంకారప్రాయంగా మినరల్ వాటర్ ప్లాంట్లు
- చేతిపంపులను ఆశ్రయిస్తున్న ప్రజలు
- పాలకుల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



సీతంపేటలో మరమ్మతుకు నోచుకోని మినరల్ వాటర్ ప్లాంట్

ఉమ్మడి మండలంలోని సింగరేణి ప్రభావిత గ్రామాలైన బుధవారంపేట(రామయ్యపల్లి), లద్నాపూర్, ఆదివారంపేటలో సింగరేణి యాజమాన్యం మినరల్ వాటర్ ప్లాంట్లు(శుద్ధజల యంత్రాలు) ఏర్పాటు చేసింది. లద్నాపూర్, బుధవారంపేటలో ఇవి సజావుగానే పనిచేస్తున్నాయి. అయితే ఆదివారంపేటలో ఏర్పాటు చేసిన ప్లాంటు ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. మచ్చుపేటకు మంజూరు చేసి రెండేళ్లు గడుస్తున్నా నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ముత్తారం, సీతంపేట, మైదంబండ, లక్కారం, పోతారం, హరిపురం గ్రామాల్లో వరంగల్ డయాసిస్ సాంఘీక సేవా సంస్థ సహకారం ప్రజల భాగస్వామ్యంతో ఆరేళ్ల క్రితం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో పోతారం, హరిపురంలో మినహా ఎక్కడ పనిచేయడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యంతో ప్రజలకు ఉపయోగపడక అలంకారప్రాయంగా మారాయి.

చర్యలు తీసుకుంటాం



మండలంలోని వివిధ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్ల గురించి ఆయా గ్రామాల సర్పంచులతో చర్చించి మరమ్మతుల చేయించి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం.

- రమేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో

మనస్పర్ధలతో..

ముత్తారంలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను సమీపంలోని ప్రభుత్వ బోరుకు మోటార్ బిగించి నడిపించారు. అయితే కొద్దిరోజుల తర్వాత వాటర్‌ప్లాంట్ నిర్వాహకుల మధ్య మనస్పర్ధలు ఏర్పడడంతో ప్రభుత్వ బోరును అక్రమంగా వినియోగిస్తున్న విషయం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ప్రభుత్వ బోరుకు బిగించిన మోటార్‌ను తొలగించారు. అప్పటి నుంచి నీటిసౌకర్యం లేక నిరుపయోగంగా మారింది. లక్కారంలోని ప్లాంట్‌కు పబ్లిక్ కాంట్రిబ్యూషన్ చెల్లించిన నిర్వాహకుల మధ్య ఏర్పడిన వివాదాల కారణంగా మూతపడింది. మైదంబండలో నడిపించేవారు లేక మూలనపడింది. సీతంపేటలో చెడిపోయిన ప్లాంట్‌కు మరమ్మతులు చేయించకపోవడంతో తెరుచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అలంకారప్రాయంగా మారిన వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకరావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

రెండు గ్రామాల్లో 104 సేవలు

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్, పారుపెల్లి గ్రామాల్లో 104 సిబ్బంది మంగళవారం గ్రామస్తులకు వైద్యసేవలు అందించారు. పంచాయతీ కార్యాలయల ఆవరణల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో 80 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దూబాసి దేవేంద్రలతోపాటు ఫార్మసిస్ట్ మధు, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యుడిపై ఆర్డీవోకు ఫిర్యాదు

మంథని: మంథని పశువైద్యశాల సక్రమంగా తెరుచుకోవడం లేదని మంథని శ్రావణ్‌కుమార్ మంగళవారం ఆర్డీవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పశువైద్యుడు సక్రమంగా విధులకు హాజరుకావడంలేదని, సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

సమాచార హక్కు చట్టం దరఖాస్తులు

ముత్తారం: బుధవారంపేట(రామయ్యపల్లి)కు సంబంధించిన పలు అంశాల సమాచారం గురించి వివిధ శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తులు చేసినట్లు కన్నూరి కుమార్ తెలిపారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన రామయ్యపల్లిలో భూసేకరణ చేపట్టడం జరుగుతుందని అందుకోసం గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టొద్దని భూసేకరణ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు చెప్పుతున్నా ఇప్పడు పంచాయతీ భవనం నిర్మాణం ఎలా చేపడుతున్నారని, దాని నిర్మాణానికి అధికారికంగా అనుమతి ఉన్నదా? ఉంటే ఎన్ని నిధులు మంజూరయ్యాయి? దానికి సంబంధించిన వివరాలు అందించాలని పీఆర్ డీఈకి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. వ్యక్తిగత అవసరాల కోసం బోరును వేసుకునే అనుమతి ఉందా? అని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసినట్లు చెప్పారు. ఓసీపీ2 విస్తరణ కోసం ఎన్ని గ్రామాలు తీసుకుంటున్నారు? దానిలో వ్యవసాయ భూమి ఎంత ఉంది? అసలు భూసేకరణ చేపడతారా? అని ఆర్‌జీ 3 జీఎంకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. గ్రామంధిలో అభివృద్ధి పనులు చేపట్టుకోవచ్చా? లేదా?అని భూసేకరణ ప్రత్యేక కలెక్టర్‌ను దరఖాస్తులో కోరినట్లు పేర్కొన్నారు. 2013 నుంచి ఇప్పటివరకు గ్రామంలో ఎన్ని కొత్త కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు? ఇప్పటివరకు ఎన్ని ఇంటి పన్నుల వసూలు చేశారని ఎంపీడీవోకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు.

పెన్షనర్లకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో పింఛన్ తీసుకునే లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు బ్యాంకు మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బ్యాంకులో ఒకే కౌంటర్ ఉండడంతో పింఛన్ తీసుకునేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. బ్యాంకులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉప్పరి శ్రీనివాస్, అజయ్, అరుణ్‌కుమార్‌లున్నారు.



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రభుత్వం ఆదుకోవాలి

మంథని: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించి తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి భాస్కర్ అన్నారు. మంథనిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తాము అనేక సమస్యలతో సతమతమవుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఐడీ కార్డులను అందజేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు తూర్పాటి సత్యనారాయణ, మంథని, ముత్తారం మండల శాఖ అధ్యక్షులు దండు రమేశ్, వీరస్వామి పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

కాల్వల్లో పూడిక తీయించాలి



కమాన్‌పూర్ మండల పరిధిలో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్లో పూడికను ఉపాధిహామీ పథకం కూలీలతో తొలగించాలి. రబీసాగులో భాగంగా ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల చేశారు. పూడికతో సాగునీరు చివరి వరకు అందని దుస్థితి నెలకొంది. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ఉండేవిధంగా కాల్వలతో సాగునీరు అందేలా చూడాలి.

- జంగిలి కనుకయ్య, గుండారం

12

మన మంథని

సాక్షి
పెద్దపల్లి

బుధవారం | జనవరి | 3 | 2018



వెండితెర



పడిపోయా నీ మాయలో..
శ్రీనివాస(ఫోన్–241688)

గృహం
న్యూఅశోక(ఫోన్–244885)

జవాన్
ఊర్వశి(ఫోన్–244885)

కమాన్‌పూర్

ఎంసీఏ
వెంకటేశ్వర
11:00, 2:00, 6:00, 9:00.

మారని బోర్డు



రామగిరి(సెంటినరీకాలనీ): రామగిరి మండలం బేగంపేట ఆరోగ్య కేంద్ర భవనం బోర్డు ఇప్పటికీ కరీంనగర్ జిల్లాగానే ఉంది. నూతన జిల్లా ఏర్పడి ఏడాది కాలం కావస్తున్నా అధికారులకు మాత్రం ఇంకా పాత జిల్లాపై మక్కువ తీరినట్లు లేకపోవడంతో ఇప్పటికీ ఆస్పత్రి భవనానికి నూతన జిల్లా పేరు రాయించడం లేదు.

Zone Guide

అధికారుల సమాచారం

మంథని మండలం:

పద్మయ్య	ఆర్డీవో	7995070705
సుధాకర్	తహసీల్దార్	7995070741
వెంకట్‌చైతన్య	ఎంపీడీవో	9989930744
నటేష్ గౌడ్	సీఐ	9440795150
ఉపేందర్	ఎస్సై	9440795159
విజయభాస్కర్	వ్యవసాయ సహాయ సంచాలకులు	7288894156
చిందం శ్రీకాంత్	వ్యవసాయ అధికారి	7288894157
శ్రీనివాస్	ఏఈ, ఎన్‌పీడీసీఎల్	9440811911

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- సుందిల్ల బ్యారేజీ నుంచి సాగునీరు అందించేందుకు ప్రణాళికలు
- ఎమ్మెల్యే పుట్ట మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్ట మధు

కమాన్‌పూర్: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవకుడిలా పనిచేస్తానని, పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. 'మన ఊరు–మన ఎమ్మెల్యే' రెండో విడతలో భాగంగా మండలంలోని రాజాపూర్, గుండారం, పేరపల్లి, రొంపికుంట, నాగారం, పేంచికల్‌పేట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. రైతులు రాత్రిపూట పొలాలకు సాగునీరు పెట్టడానికి వెళ్లి ప్రమాదాలకు గురికావద్దనే లక్ష్యంతో వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా, భూ రికార్డుల శుద్ధీకరణ సర్వే వంటి పనులు చేస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో సుందిల్ల బ్యారేజీ నుంచి కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల్లోని చెరువుల్లోకి సాగునీరు అందించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని విధాల అభివృద్ధి చేసి ప్రజల ముందుకు వస్తున్నామని అన్నారు. ఆయా గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు. గుండారంలో కల్యాణలక్ష్మి చెక్కు అందజేశారు. రొంపికుంట ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన కిచెన్‌షెడ్‌ను ప్రారంభించారు. పలువురు మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల సంపత్, వైస్ ఎంపీపీ కొట్టె భూమయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ పుల్లెల కిరణ్, కమాన్‌పూర్, రామగిరి టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి, పూదరి సత్యనారాయణ, సర్పంచులు గట్టయ్య, పులిపాక శారద, సాగి శ్రీధర్‌రావు, సాగంటి లక్ష్మి, ఎంపీటీసీ గాదె అనురాధ, ఉప సర్పంచ్ బొంతల లక్ష్మి, నాయకులు ఇనగంటి రామారావు, ఇనగంటి భాస్కర్‌రావు, పీట్ల గోపాల్, దాసరి రాయలింగు, గాదె సదయ్య, బోయిని బాలకృష్ణ, పొనగంటి కనుకయ్య, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, రాయలింగు, రమేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సుసాధ్యం చేసిన కేసీఆర్

ముత్తారం: నిరంతర త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అసాధ్యమని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ సుసాధ్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కరెంట్ కష్టాలు, కరువు తాండవం చేస్తుందని ఎద్దేవ చేసిన ఆంధ్రా నాయకులకు నేడు చేస్తున్న నిరంతరం విద్యుత్ సరఫరా చెంపపెట్టులాంటిదని హితవు పలికారు. నిరంతర విద్యుత్ సరఫరాతో రైతాంగం మదిలో కేసీఆర్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ అత్తె చంద్రమౌళి, సింగిల్‌విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, నాయకులు పెయ్యాల కుమార్, సంజీవరెడ్డి, రమేశ్, మొగిళి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మంథని: మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, ఆయన కుమారుడు టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సునీల్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హైదరాబాద్‌లో మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 24 విద్యుత్ సరఫరా రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

నాలుగు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు



గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ముత్తారం: మండలంలోని కేశనపల్లి, దరియాపూర్, పారుపెల్లి, ముత్తారం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన భూ రికార్డుల శుద్ధీకరణలో చేసుకున్న దరఖాస్తుల మేరకు సవరణ చేసిన రికార్డుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇందారపు పుష్పలత మాట్లాడుతూ సవరణ చేసిన రికార్డుల్లో తప్పులు ఉన్నట్లయితే రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే మరోసారి సవరణ చేసి తుది జాబితా వెల్లడిస్తామని వివరించారు. ఈనెల 3న పోతారం, ఓడేడ్, మైదంబండ, అడవిశ్రీరాంపూర్, 4న మచ్చుపేట, లక్కారం, శాత్రాజ్‌పల్లి, 5న శుక్రవారంపేట, ఖమ్మంపల్లి, ఇప్పలపల్లి, సర్వారం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ పోచయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గ్రామస్తుల నిరసన

బుధవారంపేట(రామయ్యపల్లి)లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో అధికారుల తీరుకు నినాదాలు చేస్తూ గ్రామస్తులు నిరసన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పొందుపర్చి సభలో చదివి వినిపించే క్రమంలో గ్రామశివారులోని 708.16 ఎకరాల వ్యవసాయ భూమిలో పట్టాదారుల పేర్లు కాకుండా సింగరేణి స్వాధీనం అని నమోదు చేయడంతో ఆగ్రహించిన గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయభూమితోపాటు గ్రామాన్ని తీసుకుంటామని సింగరేణి అధికారులు ముందుగా చెప్పినప్పటికీ ఎలాంటి పరిహారం చెల్లించకుండా స్వాధీనం అని ఎలా రికార్డులో వ్రాసారని నిలదీశారు. పరిహారం చెల్లించే వరకు ప్రభుత్వం అందిస్తున్న ఎకరానికి రూ.4వేలు పట్టాదారులకు చెల్లిస్తేనే గ్రామంలోకి రావాలని లేనిపక్షంలో మాగ్రామానికి రావల్సిన అవసరం లేదని అధికారులను తిప్పి పంపారు. ఈమేరకు సర్పంచ్ శంకేసి రవీందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఇంటర్వ్యూ



టి.శంకరయ్య
అంశం : శాంతి భద్రతలు
ఎస్సై, రామగిరి

ప్రశ్న: మండలంలో శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలేవి?

జవాబు: శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం నిఘా పెంచడంతోపాటు అన్ని ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేశాం. ఎక్కడ సమస్య తలెత్తిన నిమిషాల్లో అక్కడకు చేరే విధంగా రూపకల్పన చేశాం.

ప్రశ్న: ఇప్పటివరకు స్టేషన్లో ఎన్ని కేసులు నమోదయ్యాయి?

జవాబు: నూతన సంవత్సరంలోగా 147 కేసులు నమోదయ్యాయి. వీటిలో చాలా వరకు కుటుంబంలో నెలకొన్న సమస్యలే అధికంగా ఉన్నాయి.

ప్రశ్న: శాంతిభద్రత పరిస్థితి ఎలావుంది?

జవాబు: పూర్తిస్థాయిలో కంట్రోల్‌లో ఉన్నాయి. ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు గ్రామాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాం. అంతేకాకుండా ప్రతి ఫోన్‌కాల్‌కు స్పందిస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: డ్రంకెన్ డ్రైవ్, త్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై తీసుకుంటున్న చర్యలేవి?


జవాబు: డ్రంకెన్ డ్రైవ్, త్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు కోర్టులో హాజరు పర్చుతున్నాం.

ప్రశ్న: మీరిచ్చే సలహా?

జవాబు: మద్యం సేవించి వాహనం నడుపుట చట్టరీత్యా నేరం. అలాంటి వారికి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి మొదటి నేరం కింద నామమాత్రపు జరిమానాతో వదిలివేయడంతోపాటు వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఇలాంటి పరిణామాలు ఉధృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతోపాటు వారి లైసెన్స్, ఆధార్ నంబర్లను నోట్ చేసుకుంటున్నాం.

– రామగిరి(సెంటినరీకాలనీ)

మహిళా స్ఫూర్తి.. చైతన్య కీర్తి



- ఆర్థిక స్వావలంబనలో సిరిసిల్ల మహిళలు ప్రథమం
- మహిళా సంఘాలకు దక్కిన 'స్త్రీనిధి' అవార్డు
- సమాజ సేవలో జమ్మికుంట వనితలు
- ఆరేళ్లుగా స్ఫూర్తిదాయక కార్యక్రమాలు

'ఆమె' ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేస్తోంది. ఇంటాయనపై ఆధారపడకుండా ఇంటిబండిని నడపడానికి తన వంతు సాయం అందిస్తోంది. రాజన్న సిరిసిల్లలోని మహిళలు సంఘాలుగా ఏర్పడి 'స్త్రీనిధి' ద్వారా రుణాలు పొంది, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించారు. రెండేళ్లలో సుమారు రూ.12కోట్లకు పైగా లక్ష్యానికి మించి రుణాలు పొంది.. 99.8శాతం రికవరీ నమోదు చేశారు. రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచి స్త్రీనిధి అవార్డు సొంతం చేసుకున్నారు. జమ్మికుంటకు చెందిన పలువురు మహిళలు పేదలకు చేయూత నివ్వాలని సంకల్పించారు. సంఘంగా ఏర్పడి పలు సేవా కార్యక్రమాల్లో 'మేముసైతం' అంటూ ముందుకొస్తున్నారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థికంగా బలపడుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళలు.. సేవా దృక్పథంతో ముందుకెళ్తున్న జమ్మికుంట మహిళామణులపై కథనం...

సామాజిక సేవలో వనితలు

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన పలువురు మహిళలు సేవా కార్యక్రమాలకు సంకల్పించారు. వెంటనే సమావేశమై సంఘంగా ఏర్పడ్డారు. దానికి 'వాసవీ వనిత క్లబ్' గా నామకరణం చేసుకున్నారు. పేదవారికి చేయూతనందిస్తూ... సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పలువురు మన్ననలను పొందుతూ 'వని త'లూ శెభాష్ అనిపించుకుంటున్నారు.


వాసవి వనిత క్లబ్ మహిళలు


హరితహారంలో మొక్కలు నాటుతున్న మహిళలు


వికలాంగుడికి వీల్‌చైర్ అందిస్తున్న క్లబ్ సభ్యులు

2012లో ఏర్పాటు...

జమ్మికుంటకు చెందిన రైస్‌మిల్ వ్యాపారి గర్రెపల్లి రాజమౌళి సతీమణి అరుణాదేవికి సామాజిక సేవ చేయాలని ఆలోచన తట్టింది. అనుకున్నదే తడువుగా.. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మహిళలతో చర్చించింది. వారి నుంచి మంచి స్పందన రావడంతో 2012లో 'వాసవి వనిత క్లబ్'ను ఏర్పాటు చేశారు. 50 మందితో ప్రారంభమైన క్లబ్ అనేక సామాజిక కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం క్లబ్‌లో 100 మంది సభ్యులు ఉన్నారు.

'సాక్షి' కథనంతో..

జమ్మికుంటకు చెందిన గుగ్గిళ్ల వాణి..శ్రీవాణి అక్కా చెల్లెల్లు. చిన్నతనంలో ఇద్దరూ నరాలకు సంబంధించిన వ్యాధితో మంచాన పడ్డారు. 2013లో వీరి దీనగాథపై 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందిచిన వాసవి వనిత క్లబ్ మహిళలు రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న పలువురు ముందుకొచ్చి రూ. 4 లక్షల వరకు సాయం చేశారు. అప్పటి నుంచి ప్రారంభమైన క్లబ్ సామాజిక కార్యక్రమాలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

వీరు అందించిన సేవలివే...

జమ్మికుంట పట్టణంలో ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఏటా నోటు బుక్కులు, పెన్నులు అందిస్తున్నారు. మానసిక విద్యార్థులకు బట్టలు, ప్లేట్లు, గ్లాస్‌తో పాటు ఆర్థికంగా ఆదుకుంటున్నారు.పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ఆర్థికసాయంతో పాటు పుస్తె, మెట్టలు అందిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద రూ.50వేలతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయించారు. కాన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద రూ. 50 వేలతో ముఖ ద్వారం ఏర్పాటు చేశారు. ఏటా జనవరి 26, ఆగస్టు 15కు పేదలకు చేయూతనందిస్తున్నా రు. హరితహారం కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ముగ్గులపోటీలు నిర్వహిస్తూ యువతుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా మందులు అందిస్తున్నారు.

వేసవిలో చలివేంద్రాలు

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో, ఆలయాల్లో వాటర్‌కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు బియ్యం పంపిణీ, ఆలయాల్లో అన్నదానం చేస్తున్నారు. మహిళా, మాతృదినోత్సవం, గాంధీ జయంతికి ఉచితంగా కుట్టుమిషన్లు, వికలాంగులకు వీల్‌చైర్స్, చెవుడు పరికరాలు అందిస్తున్నారు. ఇవే కాకుండా ఏటా లక్షల రూపాయలకు సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఇందుకోసం సభ్యులందరూ సమానంగా వెచ్చిస్తుంటారు.

ఎన్నో కార్యక్రమాలు..



క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేను అధ్యక్షురాలిగా పనిచేసిన సమయంలో క్రీడాకారులకు సామగ్రి, పేదలకు ఆర్థికసాయం అందించాం. మహిళలంతా కలిసి ఇలా ముందుకు సాగడంలో ఆనందం ఉంటుంది.ఈ అవకాశం మరిచిపోలేనిది.

– ముక్క మాధవి, మాజీ క్లబ్ అధ్యక్షురాలు

సేవ చేయాలనే...



ప్రజాసేవలో మహిళలూ మా వంతు పాత్ర పోషించాలని 2012లో క్లబ్ ఏర్పాటు చేశాం. అప్పటి నుంచి క్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పేదలకు సహాయ, సహకారాలు అందిస్తే మనసు తృప్తిగా ఉంటుంది. మహిళలు ఎందులో తీసిపోరు అనేదానికి మా సంస్థ స్ఫూర్తిదాయకం.

– గర్రెపల్లి అరుణదేవి, క్లబ్ డెప్యూటీ గవర్నర్, జమ్మికుంట

సేవలోనే సంతోషం



ఏడాదికాలంగా క్లబ్‌అధ్యక్షురాలిగా సేవాకార్యక్రమాలు అందిస్తున్నా. పేదలకు, అభాగ్యులకు, అపదలో ఉన్నవారికి సేవ చేయడంలో కలిగే ఆనందం అంతాఇంతా కాదు. చేయూతనందుకుంటున్న వారి కళ్లల్లో కన్పించే ఆనందాన్ని చూస్తుంటే మరింత సేవ చేయాలనే అలోచన ఉంటుంది.

– గౌరిశెట్టి అపర్ణ, క్లబ్‌అధ్యక్షురాలు, జమ్మికుంట


సిరిసిల్లలో స్త్రీనిధి బ్యాంకు సభ్యులు

స్వశక్తి చాటారు..

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా సంఘాల్లో ఆర్థిక చైతన్యం వచ్చింది. రుణాలు తీసుకోవడమే కాదు.. వాటిని సకాలంలో, సక్రమంగా తీర్చడంలోనూ ఆదర్శంగా నిలిచాయి. తీసుకున్న సొమ్మును సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాయి. 'స్త్రీనిధి' ద్వారా గత రెండేళ్లలో సుమారు రూ.12కోట్లకు పైగా లక్ష్యానికి మించి రుణాలు పొందాయి. 99.8శాతం రికవరీ నమోదు చేశాయి. దీంతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాయి. స్త్రీనిధి అవార్డు సొంతం చేసుకున్నాయి.

ఆర్థికాభివృద్ధికి 'స్త్రీనిధి'..

రుణాలు పొందిన మహిళా గ్రూపుల్లోని సభ్యుల వాటాధనంతో వారి వ్యక్తిగత అవసరాలు, వ్యాపారాభివృద్ధి, సామాజిక అవసరాల నిమిత్తం నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం స్త్రీనిధి బ్యాంకు ఏర్పాటు చేసింది. పట్టణ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలు(మెప్మా,సెర్ప్) ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా ఏడాదికి 12.5శాతం వడ్డీతో రూ.25వేల వరకు రుణం ఇస్తున్నారు. ఒక్కో సంఘంలోని ఆరుగురు సభ్యులకు వీటిని అందజేశారు.

'స్త్రీనిధి' ద్వారా ప్రయోజనాలు..

స్త్రీనిధి రుణం పొందడానికి మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. స్వశక్తి గ్రూపు సభ్యురాలై ఉండి..ఆన్‌లైన్ ద్వారా రుణానికి దరఖాస్తు చేసుకోవాలి. బ్యాంకర్లు అర్జీని విచారించి కేవలం 48గంటల్లోనే దరఖాస్తుదారుల బ్యాంకు అకౌంట్లో సొమ్ము జమచేస్తారు. అంతేకాదు.. రుణం పొందిన వారి పేరిట ప్రభుత్వం రూ.200 బీమా పథకం అమలు చేస్తోంది. తద్వారా రుణగ్రహీతలు ప్రీమియం చెల్లించకముందే.. అకాల మరణం పొందితే మిగతా సొమ్ము మాఫీ అవుతుంది. రుణ మొత్తాన్ని వ్యాపారాభివృద్ధికే కాకుండా పిల్లల చదువులు, కుటుంబసభ్యుల ఆరోగ్యం, ఇతర సామాజిక అవసరాలకూ వినియోగించొచ్చు.

స్త్రీనిధి బ్యాంకులో సమాఖ్యలు	562
సిరిసిల్ల పట్టణ సమాఖ్యలు	75
స్వశక్తి సంఘాల సభ్యులు	18,000

వడ్డీలేని రుణం తరహాలోనే..

సభ్యులు తీసుకున్న రూ.25 వేల రుణ మొత్తానికి ఏడాదికి 12.5శాతం వడ్డీ కట్టినా.. వాటి నుంచి 1.5 శాతం ఏడాదికోసారి బ్యాంకు సభ్యులకు డివిడెండ్ చెల్లిస్తుంది. మిగతా వడ్డీ మొత్తాన్ని సభ్యుల పేరిట బ్యాంకు ఖాతాలో నిర్ణీత గడువు ప్రకారం జమచేస్తుంది. రెండేళ్లపాటు కిస్తీలు చెల్లించే వరకు సభ్యులకు బీమా షరతులు వర్తిస్తాయి. పట్టణంలో 75 సమాఖ్యలుండగా ఇందులో 18వేల మంది సభ్యులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇందులో 40శాతం మంది మహిళలు స్త్రీనిధి రుణాలు పొందారు. రెండేళ్లుగా 99.8 శాతం రికవరీ నమోదు చేస్తున్నారు. దీంతో గత డిసెంబర్ 29న హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ మంత్రి జూపెల్లి కృష్ణారావు, మెప్మా ఎండీ శ్రీదేవి ద్వారా మెప్మా పీడీ కేవీ రమణాచారి, ఏడీఎంసీలత, టీఎంసీ రాజమణి, ఆర్‌ఎంటీవీ రవికుమార్ అవార్డును అందుకున్నారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం(రూ.కోట్లలో)

	ఏడాదిలక్ష్యం	ఇచ్చింది
2016-17	4.26	5.78
2017-18	10	6.13
రెండేళ్లుగా రికవరీ శాతం	99.8	

రెండుసార్లు రుణం తీసుకున్న



రెండేళ్ల క్రితం మా ఆయనతో కలిసి మెడికల్ ఏజెన్సీ ప్రారంభించాం. స్వశక్తి సంఘం నుంచి రుణం తీసుకున్నం. ఆ తర్వాత స్త్రీనిధి ద్వారా రెండుసార్లు రూ.25 వేలు చొప్పున రుణం పొందినం. ప్రతినెలా 20వ తారీఖున కిస్తీ చెల్లిస్తున్నం.

– వెంగళ ఉమ, మెడికల్ ఏజెన్సీ, సిరిసిల్ల

తెలంగాణలోనే 'స్త్రీనిధి'



స్త్రీనిధి బ్యాంకు కేవలం తెలంగాణలోనే ఉంది. స్వశక్తి సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూతతో పాటు సామాజిక అవసరాలు తీర్చేందుకు ఈబ్యాంకు దోహదం చేస్తుంది. మన జిల్లా మహిళలు రుణాలు తీసుకోవడం, చెల్లించడంలో రికార్డు నెలకొల్పడం అభినందనీయం. మహిళలు ఇలా ముందుకెళుతూ ఇతర రాష్ట్రాల వారికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నా.

– కేవీ రమణాచారి, మెప్మా పీడీ, సిరిసిల్ల

ఐదుదశల్లో అవార్డులు



స్త్రీనిధి అవార్డులను ఐదుదశల్లో గెలుచుకున్నాం. రుణగ్రహీతలు సక్రమంగా కిస్తీలు చెల్లించడమే కాకుండా వాటిని సద్వినియోగం చేసుకోవడం సంతోషదాయకం. జిల్లానుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడం అదే ప్రోత్సాహంతో ఉత్సాహంగా ముందుకు సాగడం అవార్డుకు సహాయ పడింది.

– నాగుల సుమలత, ఏడీఎంసీ


స్త్రీనిధి అవార్డు తీసుకుంటున్న మెప్మా పీడీ కే.వి.రమణాచారి, సిబ్బంది


మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఉమ

